



సాగర్ ఎడమకాల్వలో నీటిప్రవాహాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

హమ్మయ్య...

ఎట్టకేలకు సాగర్ ఎడమకాల్వ మరమ్మతులు పూర్తి

- తెల్లవారుజామున సాగునీరు విడుదలచేసిన అధికారులు
- పరిశీలించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ముందు జాగ్రత్తగా కాల్వ కట్ట ఎత్తు పెంచాలని ఆదేశం

కూసుమంచి, సెప్టెంబరు 24: ఎట్టకేలకు సాగర్ ఎడమకాల్వ పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయి. 23రోజుల అనంతరం ఇరిగేషన్ అధికారులు గండి పూడ్చివేత పనులు పూర్తిచేశారు. దీంతో మంగళవారం తెల్లవారుజామున సాగర్ రెండోజోన్ ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూసుమంచి మండలం మల్లాయిగూడెం వద్ద ఎడమకాల్వకు గండ్లు పడినసంగతి తెలిసిందే. అదేవిధంగా యూటీ గోడలు కూలిపోయాయి. మరమ్మతుల్లో స్థానికంగా కొన్ని అవరోధాలు రావడంతో ఆలస్యమైంది. ఈ క్రమంలో రైతులు, విపక్షాలు, రైతుసంఘాలు పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. జిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు పనుల నిర్వహణను పర్యవేక్షిస్తూ యుద్ధప్రాతిపదికన పూర్తయ్యేలా చేశారు. సోమవారం అర్ధరాత్రికి పనులు పూర్తవడంతో ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. మొదట 500క్యూసెక్కులు ఇచ్చిన అధికారులు క్రమేణా నీటి విడుదల 2000 కూసెక్కులకు పెంచారు.

ప్రవాహాన్ని పరిశీలించిన మంత్రి పొంగులేటి

పాలేరు జలాశయం వద్ద నీటి విడుదల చేసిన సందర్భంగా ప్రవాహాన్ని మంత్రి పొంగులేటి పరిశీలించారు. ఈ సందర్భంగా వివరాలను ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంత్రి నీటి ప్రవాహాన్ని పరిశీలించిన సమయంలో కేవలం 1500 క్యూసెక్కులు మాత్రమే ఇస్తుండగా నీటివిడుదలను వెంటనే పెంచాలని ఆదేశించారు. బుధవారం (మిగతా 6వ పేజీలో)

ఎట్టకేలకు కొలతలు

సర్కారు ఆస్తులకు పన్ను వేసేందుకు కదిలిన అధికారులు

ఖమ్మం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఖమ్మం నగరపాలక సంస్థ అధికారులు కదిలారు. నగరం నడిబొడ్డున ఉన్న ఐటీ హబ్, వెజ్- నాన్ వెజ్ మార్కెట్‌కు సంబంధించి పన్ను విధించేందుకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా మంగళవారం నిర్మాణాల కొలతలు సేకరించారు. కాగా కార్పొరేషన్ కార్యాలయ అధికారుల నిర్లక్ష్యంతో నగరంలోని ఆర్టీసీ బస్టాండ్, ఐటీ హబ్, వెజ్- నాన్‌వెజ్ మార్కెట్లతోపాటు మరికొన్ని ప్రైవేటు భవనాల్లోని కమర్షియల్ కాంప్లెక్స్‌లకు ఏళ్ల తరబడి పన్ను విధించలేదంటూ 'ఆంధ్రజ్యోతి'లో 'ఇవి ఆస్తులు కావా?, అసెస్‌మెంట్‌పై దాగుడుమూతలు' శీర్షికలతో వరుసగా రెండు రోజులపాటు కథనాలు ప్రచురించిన విషయం విదితమే. ఈ కథనాలపై స్పందించిన ఉన్నతాధికారులు పన్నులు వేయాలని ఆదేశించడంతో అధికారులు ఆయా నిర్మాణాలకు సంబంధించి కొలతలు సేకరించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాష్ట్రంలోనే ఖమ్మం నగరం లివింగ్ సిటీగా మారబోతోందని, అన్ని ప్రాంతాల ప్రజలు ప్రశాంతంగా జీవించడంతోపాటు, ఇతర రాష్ట్రాలకు సైతం జాతీయ రహదారుల ద్వారా రాకపోకలు సాగించే సౌలభ్యం కలగబోతోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఖమ్మం కలెక్టరేట్‌లో మంగళవారం మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. తుఫాన్, వరదల కారణంగా పంటలు నష్టపోయిన రైతుల కోసం సర్వే జరుగుతోందని, సర్వే పూర్తయిన తర్వాత ఎకరానికి రూ.10 వేల పరిహారం అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే అత్యధికంగా జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతోందని, ఒకప్పుడు సెంటీమీటరు జాతీయ రహదారి లేని ఖమ్మం జిల్లా... ఇప్పుడు రాష్ట్రంలోనే అత్యధిక జాతీయ రహదారులు కలిగిన జిల్లాగా రూపుదిద్దుకోబోతుందని, ఖమ్మం జిల్లా నుంచి ఏ రాష్ట్రానికైనా సౌకర్యవంతంగా ప్రయాణించే సదుపాయం కలగబోతోందని తెలిపారు. ఖమ్మం తనదైన అభివృద్ధితో ముందుకుసాగుతోందని అన్నారు.



ఖమ్మం కలెక్టరేట్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

మన ఖమ్మం ఇక.. లివింగ్ సిటీ

ఏ రాష్ట్రం నుంచైనా రాకపోకలు సాగించేలా జాతీయ రహదారులు

- నగరం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటుకు చర్యలు
- మున్నేరు రక్షణ గోడల నిర్మాణంపై నిపుణుల కమిటీ
- చెరువులు, కాలువల పూర్వపు స్థితిని గుర్తించేందుకు నేషనల్ రిమోట్ సెన్సింగ్‌కు లేఖ
- సాగర్ ఎడమ కాలువ గండి పూడ్చివేత పనుల్లో సమన్వయ లోపంపై విచారణ
- పంటల నష్టం నివేదిక రాగానే రైతులకు రూ.10వేల చొప్పున పరిహారం
- వందరోజుల్లో ప్రకాష్‌నగర్ బ్రిడ్జి మరమ్మతుల పూర్తి
- వరదలతో ఆర్అండ్‌బీకి రూ.750 కోట్లు నష్టం
- పామాయిల్ సాగుకు అన్ని రకాల ప్రోత్సాహకాలు
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తాను రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు కేంద్ర మంత్రులతో పట్టుబట్టి ఉమ్మడి జిల్లాకు విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారి మంజూరు చేయించి పూర్తిచేయించానని, విజయవాడ నుంచి జగదల్‌పూర్ రహదారి పూర్తయి రవాణా సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అలాగే కేంద్రమంత్రి గడ్కరీతో గతంలో ఖమ్మం జిల్లాకు అవసరమైన జాతీయ రహదారులన్నీ మంజూరు చేయించడం జరిగిందని, ఫలితంగా ఖమ్మం-కోదాడ జాతీయ రహదారి 31 కి.మీ. రూ.వెయ్యి కోట్లతో నిర్మించడం జరిగిందని, తద్వారా ఈ జాతీయ రహదారి ఎంతో ప్రయోజనకరంగా మారిందని, అలాగే ఖమ్మం-కురవి 37 కి.మీ. రూ.445.76 కోట్లతో టెండర్లు పిలవడం జరిగిందని, ఈ పనులు కూడా త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారి పనులు వేగంగా సాగుతున్నాయని, వచ్చే ఉగాది నాటికి ఈ పనులు పూర్తవుతాయని ఖమ్మం-దేవరపల్లికి సంబంధించి 160 కి.మీ. రూ.3500 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే నాగ్‌పూర్-అమరావతికి సంబంధించి జాతీయ రహదారి పనులు ప్రారంభమయ్యాయని, మచిలీపట్నం పోర్టుకు అనుసంధానం అయ్యేలా ఈ జాతీయ రహదారి నిర్మాణం జరుగుతుందని, ఈ గ్రీన్‌ఫీల్డ్ రహదారి (మిగతా 6వ పేజీలో)

ప్రకాష్‌నగర్ బ్రిడ్జికి వందరోజుల్లో మరమ్మతులు

ఖమ్మంలో మున్నేరు వరదల వల్ల ప్రకాష్‌నగర్ బ్రిడ్జి 9 స్పాన్లు (పిల్లర్‌పై ఉన్న స్లాబ్) దెబ్బతిన్నాయని, దీనిని సరిచేయడానికి ఒక్కో స్పాన్‌కు పదిరోజులు పడుతుందని, వంద రోజుల తర్వాత రాకపోకలు పునరుద్ధరిస్తామని మంత్రి తెలిపారు. అప్పటి వరకు రాకపోకలకోసం చప్టాను పునరుద్ధరిస్తామని తెలిపారు.

నేషనల్ రిమోట్ సెన్సింగ్‌కు లేఖ

ఖమ్మంలో వచ్చిన వరదను దృష్టిలో పెట్టుకుని పూర్వపు కాలువలు, చెరువులు, మున్నేరు నది తదితర పరిస్థితులను తెలుసుకునేందుకు నేషనల్ రిమోట్ సెన్సెస్‌కు లేఖ రాయడం జరిగిందని, వారి నివేదికల ఆధారంగా ఖమ్మం నగరంలో చెరువులు, కాలువల ఆక్రమణ లు తొలిగిస్తామని మంత్రి తెలిపారు.

మున్నేరు రక్షణ గోడల మార్పు

మున్నేరు రక్షణగోడల నిర్మాణం తాత్కాలికంగా నిలిపివేశామని నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా తిరిగి డిజైన్ల మార్పులు చేర్పులుంటాయి తప్ప స్వతాహాగా ఎలాంటి మార్పులు చేపట్టమని మంత్రి వెల్లడించారు. మున్నేరు పరివాహక ప్రాంతంలో పడిపోయిన ఇళ్లవాసులకు శాశ్వత ఇళ్లు మంజూరు చేస్తామని, వారికి పునరవాసం కలిపిస్తామని మంత్రి వివరించారు.

కేంద్రం నుంచి వరద సాయం అందలేదు..

జిల్లాలో వరదల కారణంగా ఆర్అండ్‌బీకి రూ.750కోట్లు నష్టం జరిగిందని, తక్షణ మరమ్మతులకు కింద రూ.25కోట్లు మంజూరు చేసినట్టు మంత్రి తుమ్మల తెలిపారు. కేంద్రంనుంచి ఎలాంటి వరద సాయం అందలేదని, అత్యధిక సాయం చేయాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రిని కోరడం జరిగిందని తెలిపారు. వర్షాలు, వరదలతో నష్టపోయిన పంటలు, రైతుల జాబితా రాగానే ఎకరానికి రూ.10వేల పరిహారం అందిస్తామని తెలిపారు.

కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టుకు అడుగులు

అలాగే కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు కేంద్రమంత్రి రాంమోహన్‌నాయుడును కలిసి విన్నవించడం జరిగిందని, త్వరలోనే నిపుణుల బృందం రాబోతుందని భద్రాద్రి జిల్లాలో సౌలభ్యం ఉన్న చోట ఎయిర్‌పోర్టుకు భూమి కేటాయించేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని మంత్రి తుమ్మల వెల్లడించారు.



జనం బతుకుల్లో 'చెత్త' చిచ్చు

- దానవాయిగూడెం డంపింగ్ యార్డు కాలుష్యంపై వివాదం
- మరో చోటుకు తరలించాలని స్థానికుల ఆందోళనలు 6



పెసల కొనుగోళ్లు డీలా

- ఖమ్మం, వైరా కేంద్రాలలో ఇప్పటి వరకు 350 మెట్రిక్ టన్నుల కొనుగోలు
- జిల్లాకు ఇచ్చిన టార్గెట్ 806 మెట్రిక్ టన్నుల కొనుగోలు పూర్తి చేసేనా? 6

భోరుమన్న బూరుగు గుంపు

- పిడుగుపడి ఇద్దరు గిరిజన యువతుల దుర్మరణం
- మరో ఐదుగురికి తీవ్రగాయాలు
- అరటితోటలో పని ముగించుకొని వస్తుండగా ఘటన

దమ్మపేట, సెప్టెంబరు 24: అరటి తోటలో పనికి వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో పిడుగుపడి ఇద్దరు గిరిజన యువతులు మృతి చెందారు. మరో ఐదుగురు మహిళలు గాయపడ్డారు. భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం జగ్గారం పంచాయతీ పరిధిలోని బూరుగుగుంపు సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన విరాల ప్రకారం.. బూరుగుగుంపు గ్రామానికి చెందిన ఏడుగురు గిరిజన మహిళలు గ్రామ సమీపంలోని ఓ అరటితోటలో పనికి వెళ్లారు. ఈ క్రమంలో భారీ వర్షం పడటంతో పనులు నిలిపేసి ఇంటికి వెళ్లేందుకు తోట బయట ఉన్న ఆటో వద్దకు చేరుకున్నారు. ఈ సమయంలో సమీపంలో పిడుగుపడటంతో ఏడుగురు మహిళలు స్పృహ కోల్పోయారు. వెంటనే స్థానికులు వారిని సత్తుపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు కట్టం నాగశ్రీ(20), సున్నం అనూష(18) మృతి చెందినట్లు తెలిపారు. మిగిలినవారిలో సీతమ్మ పరిస్థితి ఆందోళనకరంగా వుంది. మడివి సీత, పూకే రత్తమ్మ, కల్లూరు రాజమ్మను ఖమ్మం వైద్యశాలకు తరలించారు.

ఇదిలా ఉండగా కట్టం రాజు, వెంకటమ్మ దంపతుల కుమార్తె అయిన నాగశ్రీ ఇంటర్ వరకు చదివింది. పేద కుటుంబం కావడంతో కుటుంబానికి ఆసరాగా చదువు మానేసి కూలి పనులకు వెళుతోంది. ఈమెకు ఒక సోదరి, సోదరుడు ఉన్నారు. ఇక మరో మృతురాలు సున్నం వెంకటేష్, సుశీల దంపతుల కుమార్తె సున్న అనూష డిగ్రీ వరకు చదివింది. పేద కుటుంబం కావడంతో కూలిపనులకు వెళుతూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువతులు పిడుగుపాటుకు గురై మృతి చెందటంతో విషాదం నెలకొంది. ఈమెకు ఒక సోదరి ఉంది. పిడుగుపాటు ఘటనలో మృతి చెందిన బాధితుల కుటుంబాలకు పరిహారం అందించాలని స్థానికులు కోరారు. ఈ ఘటనపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. కాగా, పిడుగుపాటు ఘటనలో గాయపడి సత్తుపల్లిలో ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారిని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పరామర్శించారు.



కట్టం నాగశ్రీ (ఫైల్)



సున్నం అనూష (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో భారీవర్షం

ఖమ్మం టౌన్ : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని దమ్మపేట మండలంలో 8.33 సెం.మీ., ఖమ్మం జిల్లాలోని పెనుబల్లి మండలంలో 6సెం.మీ. వర్షపాతం నమోదైంది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు పలుప్రాంతాల్లో వర్షం కురుస్తూనే ఉంది. జిల్లాలోని పెనుబల్లి మండలం గౌరారంలో 6 సెం.మీ., పెనుబల్లిలో 4సెం.మీ., తల్లాడలో 3సెం.మీ., సత్తుపల్లిలో 2.9సెం.మీ., ఖమ్మంలోని ప్రకాష్‌నగర్ ప్రాంతలో 2.75. సెం.మీ., కొణిజర్ల మండలం గుబ్బగుర్తిలో 2.35సెం.మీ., వర్షపాతం నమోదైంది. అలాగే సత్తుపల్లి మండలం గంగారంలో 2.28సెం.మీ., , వేంసూరులో 1.73 సెం.మీ., రఘునాథపాలెం మండలం కొత్త కలెక్టరేట్‌వద్ద, కామేపల్లి మండలంలోని (మిగతా 6వ పేజీలో)

బాలికపై అత్యాచారం.. పోక్సో కేసు నమోదు



కరకగూడెం, సెప్టెంబరు 24: మాయ మాటలు చెప్పి 15 ఏళ్ల బాలికపై అత్యా చారానికి పాల్పడ్డాడు ఓ కామాంధుడు. ఈ ఘటన భద్రాద్రి జిల్లా కరకగూడెం మండలంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కరకగూడెం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బిజ్జా సాంబయ్య... ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికను నమ్మించి తన ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లి.. పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇన్‌చార్జ్ ఎస్ఐ రాజ్‌కుమార్ నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

భద్రాద్రి జిల్లాలో 23 మంది

ఎంఈవోల నియామకం

చుంచుపల్లి, సెప్టెంబరు 24: భద్రాద్రి జిల్లాలో 23 మంది సీనియర్ ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో)లుగా నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. వీరిలో కొత్తగూడెం ప్రభుదయాల్, ములకలపల్లి జి.సత్యనారాయణ, ఆళ్లపల్లి కె.శాంతారావు, దుమ్ముగూడెం కె.సమ్మయ్య, దమ్మపేట కె.లక్ష్మీ, పినపాక నాగయ్య, చండ్రుగొండ ఎం.సత్యనారాయణ, జూలూరుపాడు బి.జుంకీలాల్, టేకులపల్లి ఏ.జగన్, చుంచుపల్లి బి.బాలాజీ, పాల్వంచ ఎ.శ్రీరామమూర్తి, గుండాల కె.పార్వతమ్మ, భద్రాచలం టి.రామా, అశ్వారావుపేట పి.ప్రసాదరావు, అశ్వాపురం వీరస్వామి, అన్నపురెడ్డిపల్లి యు.ఆనంద్‌కుమార్, లక్ష్మీదేవిపల్లి పి.కృష్ణయ్య, సుజాతనగర్ ఎల్.లీల, ఇల్లందు టీవీఆర్ఎన్ స్వామి, బూర్గంపాడు ఎం.యాదుసింహరాజు, చర్ల పీవీ రమణ, మణుగూరు జి.స్వర్ణజ్యోతి, కరకగూడెం జి.మంజుల ఉన్నారు.



శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో..

ధర్మ పరిరక్షణ కోసం...

తిరుమల లడ్డూ అపచారంపై ఆలయంలో ప్రాయశ్చిత్త పూజలు

కొత్తగూడెం సాంస్కృతికం, సెప్టెంబరు 24: సనాతన ధర్మానికి విఘాతం కలిగిస్తే చూస్తూ ఊరుకోమని, ధర్మ పరిరక్షణకోసం ప్రతి హిందువు పాటుపడాలని కొత్తగూడెంలోని అర్చకులు, వేద పండితులు మంగళవారం పిలుపునిచ్చారు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి లడ్డూ వ్యవహారంలో జరిగిన అపచారంపై వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా కొత్తగూడెం, విద్యానగర్ కాలనీలోని శ్రీపద్మావతి గోదాసమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రాయశ్చిత్త దీక్షా కార్యక్రమాలు చేపట్టి విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, శ్రీపురుష సుక్తాది రుద్ర పారాయణం, శాంతిపూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసే వారికి కఠినశిక్షలు విధించాలని ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పీవీ వర్ధన్ రావు, శ్రీనివాస్, ప్రసాద్, శ్యాంసుందర్, వి.మురళి, పండితులు శంకరప్రసాద శర్మ, రాధాకృష్ణశర్మ, సాయిగోపాలచార్యులు, నల్లాని చక్రవర్తుల క్రాంతికుమార్, బ్రాహ్మణ, అర్చక సమైక్య సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఇల్లెందు ఎఫ్‌డీవో

వెంకన్నపై వేటు

- సర్వీసు నుంచి తొలగిస్తూ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆదేశాలు
- అటవీశాఖ రికార్డుల తారుమారుపై కొరడా



ఇల్లెందు, సెప్టెంబరు 24: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో అటవీ శాఖ అసిస్టెంట్ కన్జర్వేటర్‌గా, ఫారెస్ట్ డివిజనల్ అధికారిగా పనిచేస్తున్న కె.వెంకన్నను సర్వీసు నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ రాకేష్ మోహన్ డోబ్రియాల్ ఆదేశాలు జారీ చేశారు. వెంకన్న 2016-2018 కాలంలో ఇల్లెందులో అటవీశాఖ రేంజ్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆ సమయంలో ఆయన రోళ్లపాడు ఏరియాలో సీతారామ ప్రాజెక్ట్ పథకానికి సంబంధించి భూసేకరణలో అవకతవకలకు పాల్పడినట్టు, జీపీఎస్ మ్యాప్‌లు తారుమారు చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. ఉన్నతాధికారుల విచారణలో ఆరోపణలు రుజువు కావడంతో వెంకన్నను సర్వీసునుంచి తొలగిస్తూ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఉత్తర్వులు జారీచేశారు. కాగా, సోమవారం మంత్రి పొంగులేటి నేతృత్వంలో జరిగిన ఇల్లెందు నియోజకవర్గస్థాయి అధికారుల సమావేశంలో వెంకన్న ఎఫ్‌డీవో హోదాలో పాల్గొన్నారు.

తరుగుతున్న భద్రాద్రి ఆర్టీసీ డిపో ప్రభ

- రీజియన్ పరిధిలో ఆదాయంలో ప్రథమం నుంచి చివరకు
- రెండు నెలల్లో తొమ్మిది మందిపై శాఖాపరమైన చర్యలు
- పనిభారంతో ఆందోళన చెందుతున్న ఉద్యోగులు
- ఎస్‌డీఐ ఎంపికపైన ఆరోపణలు

భద్రాచలం, సెప్టెంబరు 24: ఖమ్మం రీజియన్‌లో భద్రాచలం ఆర్టీసీ డిపో గతంలో ఆదాయ సేకరణలో ప్రథమ స్థానంలో ఉండేది. కానీ ఇటీవల ఆదాయ సేకరణలో చివరి స్థానంలో నిలవడం సర్వత్రా చర్చకు దారి తీస్తోంది. గత రెండు నెలల్లో తొమ్మిది మంది ఆర్టీసీ డిపో ఉద్యోగులపై శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకున్నట్లు సమాచారం. మరో వైపు పని ఒత్తిడి కారణంగా ఇద్దరు ఏడీసీలు అనారోగ్యంతో సెలవుపై ఉన్నట్లు వినికిడి. కాగా సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్‌డీఐ) పోస్టు భర్తీలో సైతం పారదర్శకత పాటించలేదంటూ ఉద్యోగ వర్గాలనుంచి ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మరో వైపు భద్రాచలం ఆర్టీసీ డిపోలో డ్రైవర్లపై ప్రత్యక్షంగా పరోక్షంగా వస్తున్న ఒత్తిడితో వారిలో అంతర్గత ఆందోళన నెలకొంటోందనే ప్రచారం ఉంది.

ఖమ్మం రీజియన్‌లోనే భద్రాచలం ఆర్టీసీ డిపోకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఎందుకంటే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలం ఇక్కడ ఉండటం మరో వైపు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, సరిహద్దుల్లో భద్రాచలం డిపో ఉండటమే కారణం. అందుకు అనుగుణంగా భద్రాచలం డిపో నుంచి రీజియన్‌స్థాయిలో ఆదాయం సైతం గణనీయంగానే సమకూరేది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.7.24 కోట్ల ఆదాయం సమకూరగా, ఆగస్టులో రూ.8.11 కోట్ల ఆదాయం సమకూరింది. అయినప్పటికీ గతంలో ప్రథమస్థానంలో ఉండే భద్రాద్రి ఆర్టీసీ డిపో.. రీజియన్ స్థాయిలో ఇటీవల చివరిస్థానంలో ఉంటోంది. ఇలా ఉండటానికి కారణం ఉద్యోగులపై మానసిక ఒత్తిడి అధికమవుతోందనే ప్రచారం డిపో వర్గాల నుంచి వ్యక్తమవుతోంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం భద్రాచలం ఆర్టీసీ డిపోకు అంతగా లాభించడం లేదని డిపో వర్గాలు పేర్కొంటున్నాయి. భద్రాచలం నుంచి వెంకటాపురం రూటుతోపాటు భద్రాచలం నుంచి ఖమ్మంరూటు మినహాయిస్తే పెద్దగా మహాలక్ష్మి పథకం కింద బస్సులు నడిపే అవకాశం డిపో పరిధిలో లేదని తెలుస్తోంది. డిపో ఆంధ్రా సరిహద్దుల్లో ఉండటంతో అధికశాతం అటు వైపే తిరుగుతున్నాయని, హైటెక్, సూపర్‌లగ్జరీ, డీలక్స్ బస్సులు తెలంగాణ వైపు తిరుగుతండటం వలన ఈ ప్రభావం డిపోపై పడుతోందనే వాదన సైతం లేకపోలేదు.

ఉద్యోగుల్లో ఆందోళన

భద్రాచలం ఆర్టీసీ డిపోలో ఓ అధికారి తీరుతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇద్దరు ఉద్యోగులు చేయాల్సిన పనిని ఒక్కరే చేయాలని ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. 20మంది డ్రైవర్లు తక్కువగా ఉన్నప్పటికీ అన్ని బస్సులు తిప్పాలనే ఒత్తిడి ఉద్యోగులపై ఉంటోందని ప్రచారం సాగుతోంది. అదేవిధంగా ప్రత్యేక విభాగాల్లో సైతం ఆరుషిఫ్ట్‌ల పద్ధతిని నాలుగు షిఫ్ట్‌లకు కుదించడం, పని చేస్తే చేయండి, లేకుంటే రాజీనామా చేసి వెళ్లండి అనే ధోరణితో అధికారుల తీరు ఉండటం ఉద్యోగులను ఆందోళనకు గురి చేస్తోందంటున్నారు. ఇదిలా ఉండగా సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ఎంపిక విషయంలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వకుండా నియమించారనే ఆరోపణలున్నాయి. మొత్తం ఐదుగురు ఇందుకోసం దరఖాస్తు చేయగా అర్హులున్నా వారిని గుర్తించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని ఉద్యోగ వర్గాలు ఆరోపిస్తున్నాయి.

మన ఖమ్మం ఇక.. లివింగ్ సిటీ

(5వ పేజీ తరువాయి)

ఖమ్మం-అమరావతి పరిధిలో 306 కి.మీ. రూ.7వేల కోట్లతో పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. కొత్తగూడెంనుంచి హైదరాబాదుకు వయా వలిగొండ జాతీయ రహదారికి కూడా టెండర్లు పూర్తయ్యాయని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి హైదరాబాదుకు వయా కొత్తగూడెం,ఇల్లెందు మీదుగా రవాణ సౌకర్యం రాబోతోందని తెలిపారు.

ఖమ్మం-అమరావతి, ఖమ్మం-దేవరపల్లి, కోదాడ-ఖమ్మం, ఖమ్మం-కురవి జాతీయ రహదారులను కలుపుతూ ఖమ్మం చుట్టూ ఔటర్ రింగ్‌రోడ్డు రాబోతుందని, మంత్రి తుమ్మల వివరించారు. ఇదుకోసం కాసిరాజుగూడెం, దారేడుకు రూ.120 కోట్లతో 6 కి.మీ. పొడవున నాలుగు లైన్ల రహదారి ఏర్పాటుచేసి జాతీయ రహదారులను అనుసంధానం చేసి ఔటర్ రింగ్‌రోడ్డు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఓఆర్‌ఆర్ వెంట సర్వీసు రోడ్లు కూడా నిర్మాణం చేయడం జరుగుతుందని, తెలిపారు. అలాగే భద్రాచలం-ఏటూరునాగారం జాతీయ రహదారి ప్రతిపాదనలు పంపడం జరిగిందని అలాగే భద్రాచలం-జంగారెడ్డి గూడెంజాతీయ రహదారి గతంలో ప్రతిపాదన జరిగిందని, పోలవరం ముంపును దృష్టిలో ఉంచుకుని డిజైన్ మార్పుతో ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట మీదుగా జాతీయ రహదారి నిర్మించాలని ప్రతిపాదన చేయడం జరిగిందని తెలిపారు.

పామాయిల్ సాగుకు ప్రోత్సాహం

పామాయిల్‌పై విదేశాలనుంచి ఇండియాకు వచ్చే వాటికి దిగుమతి సుంకాన్ని పెంచినందుకు కృతజ్ఞతలు మంత్రి తెలిపారు. పామాయిల్ సాగుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సహిస్తుందని, ఐఏఎస్‌లు ఐటీ నిపుణులు పామాయిల్ సాగుచేస్తున్నారని, రాష్ట్రంలో అన్నిజిల్లాలకు పామాయిల్ సాగు విస్తరింపచేస్తున్నామని తెలిపారు.

సమన్వయ లోపంపై విచారణ

పాలేరు రిజర్వాయర్ దిగువన సాగర్ కాలువ గండిపూడ్చివేత పనుల్లో సమన్వయలోపం, పనుల జాప్యంపై విచారణ జరిపించి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. సాగర్ కాలువ మరమ్మతు పనుల్లో బుంగపడిందని, దీంతో అండర్ టన్నెల్‌ను పూర్తిగా తొలగించడం ద్వారా మంగళవారం నీరు విడుదల చేయడం జరిగిందని తుమ్మల తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, అదనపు కలెక్టర్లు మధుసూదన్‌నాయక్, పూజ, ఆర్‌అండ్‌బీ ఈఎస్‌ఈ మోహన్‌నాయక్, ఇరిగేషన్ సీఈ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్య...

(5వ పేజీ తరువాయి)

ఉదయానికి దాన్ని మూడువేల క్యూసెక్కులకు పెంచాలని సూచించారు. అదేవిధంగా కాల్వకట్ట ఎత్తు తక్కువగా ఉండటంతో నీటి విడుదల పెంచిన పక్షంలో మళ్లీ ఇబ్బందులు తలెత్తుతాయని కట్ట ఎత్తు పెంచాలని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా తాను వ్యక్తం చేసిన సందేహాలకు ఇరిగేషన్ ఈఈ అనన్య, డీఈ మధు సరైన సమాధానాలు చెప్పకపోవడంతో మంత్రి అసహనం వ్యక్తం చేశారు.

మొదటిజోన్ పరిధిలో పనులను పరిశీలించిన మంత్రి ఉత్తమ్

సాగర్ మొదటిజోన్ పరిధిలో 132 కిలోమీటరు వద్ద సాగర్‌కాల్వ మరమ్మతులను నీటిపారుదలశాఖ మంత్రి ఉతమ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను వేగంగా పూర్తిచేసి పాలేరుకు నీరివ్వాలని ఆదేశించారు. ఈ సందర్భంగా బుధవారం మధ్యాహ్నానికి నీరు ఇస్తామని ఐరిగేషన్ అధికారులు మంత్రి దృష్టికి తీసుకవచ్చారు.

భోరుమన్న బూరుగు గుంపు

(5వ పేజీ తరువాయి)

లింగాలలో 1 సెం.మీ., వర్షం కురిసింది. ఇక భద్రాద్రి కొత్తగూడెంజిల్లా దమ్మపేట మండలం మందలపల్లి 8.33 సెం.మీ., నాగుపల్లిలో 7.4సెం.మీ., మల్కారంలో 6.45 సెం.మీ., అంకంపాలెంలో 5.65సెం.మీ., నాయుడుపేటలో 4.4సెం.మీ., వర్షపాతం నమోదైంది. గుండాల మండలంం ఆళ్లపల్లిలో 4.2సెం.మీ., లక్ష్మీదేవిపల్లిలో 3.5 సెం.మీ., చంద్రుగొండ మండలం మద్దుకూరులో 2.75సెం.మీ., అశ్వారావుపేటలో 1.6 సెం.మీ., కొత్తగూడెంలో 1.8సెం.మీ., గరిమెళ్లపాడులో 1.63 సెం.మీ., ఇల్లందులో 1.5సెం.మీ., వర్షం నమోదైంది. గత 20రోజులుగా వర్షం లేకపోవడంతో వరి, పత్తి, మిర్చి పంటలు ఎండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం కురిసిన భారీ వర్షం పంటలకు ప్రాణం పోసిందని రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఐటీఐలో నూతన ట్రేడ్‌లకు దరఖాస్తులు

ఖమ్మం ఖానాపురంహవేలి సెప్టెంబర్ 24: నగరంలోని టేకులపల్లిలోగా ప్రభుత్వ ఐటీఐలో ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన ఆరు నూతన ట్రేడ్‌లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. ఐటీఐలను ప్రభుత్వం ఇటీవల ఏటీసిలుగా మారుస్తూ నూతనంగా ఆరు ట్రేడ్‌లను ఎన్‌సీవీటీ ప్యాటన్ కింద అడ్మిషన్లు పొందుటకు అవకాశం కల్పించారు. ఈ దరఖాస్తులు ఈ నెల 25 నుంచి 28వ తేదీలోగా ఆన్‌లైన్లో చేసుకోవాల్సి ఉంటుంది. నూతన కోర్సుల వివరాలు.. 1. మానుప్యాక్చర్‌రింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, 2. ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మానుప్యాక్చరింగ్, 3. ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్, 4. బేసిక్స్ డిజైనర్ అండ్ డిజిటల్ మానుప్యాక్చరింగ్, 5. అడ్వాన్స్‌డ్ సీయన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్ , 6. మెకానిక్ ఎలక్ట్రిక్ మెహికల్‌లలో వాకిన్ అడ్మిషన్లను అర్హులైన ఆసక్తి గల అభ్యర్థులు సకాలంలో చేసుకోవాలని తెలిపారు. ఈ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు శిక్షణ అనంతరం ఉద్యోగాలు వచ్చేందుకు అవకాశాలు ఉన్నట్లు తెలిపారు.

30న జిల్లా స్థాయి యువజనోత్సవాలు

ఖమ్మం స్పోర్ట్స్, సెప్టెంబరు 24: స్వామీ వివేకానంద జయంతిని పురస్కరించుకొని జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 30న నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు(యువ కళాకారుల ఎంపిక), సైన్సు మేళాను నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 15 నుంచి 29 సంవత్సరాలలోపు యువతీ యువకులు పోటీలలో పాల్గొనవచ్చని ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచిన వారిని హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర ఎంపికలకు, ఆ తరువాత అక్కడ ప్రతిభ చూపిన వారిని జనవరి 12 నుంచి 16 వరకు జాతీయస్థాయిలో జరిగే యువజనోత్సవాలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఆసక్తి గల యువత ఈనెల 28 సాయంత్రం కల్లా తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు స్టేడియంలోని సెట్‌కం కార్యాలయంలో నేరుగా, 9948207271ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించాలని కోరారు.

పెసల కొనుగోళ్లు డీలా

- ఖమ్మం, వైరా కేంద్రాలలో ఇప్పటి వరకు 350 మెట్రిక్ టన్నులు కొనుగోలు
- జిల్లాకు ఇచ్చిన 806 మెట్రిక్ టన్నులు కొనుగోలు లక్ష్యం పూర్తి చేసేనా?
- తేమ శాతం కొర్రీలతో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నరైతులు
- డిజిటల్ సిస్టంలోనూ వీడని దళారుల బెడద
- ఆందోళనలో పెసర రైతులు



ఖమ్మం మార్కెట్, సెప్టెంబరు 24: పెసల రైతులకు మద్దతు ధర దక్కాలనే ఉద్దేశ్యంతో పెసల కొనుగోలు కేంద్రాలను జిల్లాలోని ఖమ్మం, వైరా వ్యవసాయ మార్కెట్ల పరిధిలో గత ఆగస్టు నెల 30న ప్రారంభించారు. కొనుగోలు బాధ్యతను మార్క్‌ఫెడ్, డీసీఎంఎస్‌ఎకు అప్పగించగా ఆయా శాఖల మధ్య సమన్వయం లోపంతో కొనుగోలు కేంద్రాలలో పెసల కొనుగోళ్లు చాలా నెమ్మదిగా కొనసాగుతున్నాయి. కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతుల్లో మూడొంతుల మంది రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తూ తక్కువ ధరలకు అమ్ముకుంటున్నారు. జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రభుత్వం నిర్ణయించిన 12 శాతం తేమ కన్నా కొద్దిగా ఎక్కువ తేమ శాతం రావడంతో పెసల కొనుగోలు కేంద్రాలలో సిబ్బంది కొనుగోలు చేయడం లేదు. దీంతో ఆ పంటను తక్కువ ధరలకు దళారులకు అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

కొన్నది 350 మెట్రిక్ టన్నులే

జిల్లాలోని ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో సుమారు 160 మంది రైతుల వద్ద 1812 క్వింటాళ్లు, వైరా కొనుగోలు కేంద్రంలో 199 మంది రైతులకు చెందిన 1694 క్వింటాళ్లు మొత్తం కలిసి ఇప్పటి వరకు కేవలం 3500 క్వింటాళ్ల(350 మెట్రిక్ టన్నులు) పెసలను మాత్రమే కొనుగోలు చేశారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం జిల్లాలో సుమారు 14 వేల ఎకరాల్లో పెసర పంట సాగు చేయగా సుమారు 35 వేల క్వింటాళ్లు దిగుబడి వస్తుందని అధికారులు అంచనా ఉంది. ఈ ఏడాది ఆ అంచనా ప్రకారం రాష్ట్ర మార్క్‌ఫెడ్ జిల్లాలో 806 మెట్రిక్ టన్నులు అంటే సుమారుగా 8,060 క్వింటాళ్ల పెసలను కొనుగోలు చేయాలని టార్గెట్‌గా నిర్ణయించి ఆదేశించారు. కాగా రైతుల వద్ద పంట నిల్వలు ఇప్పటికే కొంతమేర తగ్గి పోగా మిగితా 4,560 క్వింటాళ్లను కొనుగోలు పూర్తి చేస్తారా అన్నది సవాలుగా మారింది.

డిజిటల్ సిస్టంలోనూ వీడని దళారుల బెడద

ప్రభుత్వం ఈ ఏడాది పెసల కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి అవకతవకలు లేకుండా కొనుగోలు దగ్గర్నుంచి గోడౌన్‌ల వద్దకు చేరే వరకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్‌ను బస్తాకు కుట్టేసే పద్ధతిని తీసుకొచ్చింది. డిజిటలైజేషన్‌కు శ్రీకారం చుట్టింది. అయినా పెసల కొనుగోలు కేంద్రాలకు రైతులు కాకుండా దళారులు సైతం అమ్మకానికి వస్తున్నారు. సిబ్బంది చేయి తడపడం లాంటివి చేస్తూ రైతుల వద్ద క్వింటాలు రూ. 5,000 ల నుంచి రూ. 6,000 ల వరకు తక్కువ ధరకు కొన్న పెసలను ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.8,682లకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఒక శాతం తేమ అధికంగా ఉన్నా కొనట్లే

కొత్తపల్లి తిరుమలరావు, తుమ్మలపల్లి



మార్కెట్‌లో అమ్ముకుందామని పెసర కొనుగోలు కేంద్రానికి వస్తే తేమ శాతం 12 కన్నా కేవలం ఒక్క శాతం ఎక్కువగాతో పంట రిజెక్ట్ అయింది. దీంతో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించా. వారు నా పంటను క్వింటాలు రూ. 4,000ల చొప్పున కొనుగోలు చేశారు.

ప్రతి పెసల గింజనూ కొనుగోలు చేస్తాం

- తేమ శాతం నిర్ధారణలో అధికారులు జిమ్మిక్కులు చేయొద్దు
- రైతులు నిబంధనలు పాటించి మద్దతు ధర రూ. 8,682 పొందాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



పెసర రైతులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మంమార్కెట్, సెప్టెంబరు 24: రైతులు పండించిన పెసలను ప్రతి గింజను కొనుగోలు చేస్తామని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో డీసిఎంఎస్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెసల కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన మాట్లాడారు. పెసల కొనుగోలు కేంద్రాల వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి సుమారు రూ. 18 వేల కోట్ల నష్టం వాటిల్లుతుందని, అయినా వెనక్కు తగ్గకుండా రైతులను ఆదుకోవడం కోసం కొనుగోలు కేంద్రాల ద్వారా పెసలను కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆయన పలువురు పెసర రైతులతో మాట్లాడారు. తేమ శాతం కారణంతో డీసీఎంఎస్ సిబ్బంది కొనుగోలు చేయట్లేదని మంత్రి తుమ్మలతో రైతులు పేర్కొనగా అక్కడున్న సిబ్బందిని పిలిచి ఎందుకు కొనుగోలు చేయట్లేదని ప్రశ్నించారు. మరోసారి తేమ శాతం మిషన్‌తో తేమ శాతాన్ని నిర్ధారించండని ఆదేశించగా.. సదరు పెసలు తేమ శాతం 12 శాతం ఉండి పాసింగ్ కావడంతో ఆయన కొనుగోలు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదట ఎందుకు కొనుగోలు చేయలేదని ప్రశ్నించారు. సిబ్బంది జిమ్మిక్కులు మాని ప్రతి రైతు పంటను కొనే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

50 ఎకరాల్లో పెసర పంట వేసి నష్టపోయా

తన సొంత వ్యవసాయ క్షేత్రంలో సుమారు 50 ఎకరాలు పెసర పంటను మొదట్లో వర్షాభావం, తీరా పంట చేతికొచ్చే సమయంలో అధిక వర్షాల వల్ల నష్ట పోయానని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. వాతావరణం కలిసి వస్తే అన్నదాతలకు మేలని వాతావరణం ఆగ్రహిస్తే ప్రతి రైతుకు కష్టాలు, నష్టాలే అని రైతులతో మాట్లాడుతూ అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన రంగుతో తమ పంటలను గ్రేడింగ్ చేసి 12 శాతం తేమ ఉండే విధంగా తీసుకు రావాలని తద్వారా కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ. 8,682 పొందాలని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కార్పొరేటర్ కమర్తపు మొరళి, కాంగ్రెస్ నాయకులు సాదు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్నేరు బాధితులను ఆదుకుంటాం

- కుదుటపడే వరకు బాధితుల వద్దే యంత్రాంగం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ముంపు ప్రాంతాల్లో రూ.2కోట్ల పనులకు శంకుస్థాపన
- బాధితులతో మాటామంతీ.. ఓదార్పు...



వరద బాధితులతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ఖమ్మంరూరల్/ఖమ్మం సంక్షేమవిభాగం, సెప్టెంబరు 24: మున్నేరు వరద పోటుకు ఆస్తులను పోగొట్టుకున్న బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మం నగరంలోని రాజీవ్ గృహకల్ప, వికలాంగుల కాలనీ, కరుణగిరి, జలగంనగర్‌లో ద్విచక్ర వాహనంపై మంత్రి పర్యటించారు. బాధితులతో నేరుగా మాట్లాడారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. అనంతరం 1వ డివిజన్ కైకొండాయిగూడెంలో రూ.2కోట్లతో నిర్మాణం జరగనున్న రహదారులు, డ్రైనేజీలు, ఇతర పనులకు శంకుస్థాపనలు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. 12 సీసీ రహదారుల నిర్మాణం జరుగుతాయని, శ్మశాన వాటిక నిర్మాణానికి నిధులు మంజూరు జరిగాయని, త్వరలోనే టెండర్ పూర్తి జరుగుతుందన్నారు. కబ్జాలకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకొని, పేదలకు పంపిణీ చేస్తామన్నారు. కొందరు వరద బాధితులు తమకు ప్రభుత్వం నుంచి ఇచ్చే వరదసాయం అందలేదని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే అధికారులను పిలిచి వాస్తవంగా ఇళ్ల నీట మునిగిన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సాయం అందాలని, మరోసారి ఇంటింటి సర్వే చేపట్టి అర్హులను గుర్తించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అనర్హులకు ఒక్కరికి కూడా పరిహారం అందడానికి వీలులేదని హెచ్చరించారు. వీధులన్నీ శుభ్రం చేసి దుర్వాసనలు రాకుండా బ్లీచింగ్ చల్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్డీవో గణేష్, తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీవో కుమార్, ఎంపీవో రాజారావు, కాంగ్రెస్ నాయకులు మద్దినేని స్వర్ణకుమారి, కళ్లెం వెంకటరెడ్డి, బండి జగదీష్, మద్ది వీరారెడ్డి, భజంగరెడ్డి, శ్రీను, మహేష్, అశోక్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు పెద్దపీట

- రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న మంత్రి

కూసుమంచి, సెప్టెంబరు 24: రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు ప్రజాప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం ద్వారా డ్వాక్రా మహిళలను కమిటీలుగా వేసి రూ.637కోట్లు కేటాయించి, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం మంత్రి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబుతో కలిసి కూసుమంచి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా కూసుమంచిలో నూతన ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి విద్యార్థినులకు పీఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా సభలో మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభించిన రోజే పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించామన్నారు. పేదవాడి వైద్యంకోసం ఎన్ని వేల కోట్లు ఖర్చయినా వెనకడుగు వేయడం లేదన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీని రూ.10లక్షలకు పెంచినట్లు తెలిపారు. కూసుమంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఉత్తమ కళాశాలగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఇప్పటికే 50 మంది విద్యార్థులు చేరారని, మరో 15 రోజుల్లో ఈ సంఖ్య 150వరకు చేరుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

విద్య వైద్యంపై మంత్రి ఆదేశాలతో ప్రత్యేక దృష్టి పెట్టినట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. జిల్లాలో 50 పాఠశాలల్లో 4నుంచి 6తరగతి చదివే పిల్లల సౌకర్యార్థం ప్రత్యేకంగా ఇంగ్లీష్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు ఆంగ్లం నేర్పడంతోపాటు ఆంగ్లంలో మాట్లాడే విధంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి బుధవారం 70మంది ప్రభుత్వ అధికారులతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ సీతారాములు, కళాశాల ప్రిన్సిపాల్ వీరభద్రరావు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై 922 అభ్యంతరాలు

- 26వరకు పరిష్కారం
- 28న తుదిజాబితా ప్రచురణ

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబర్ 24: పంచాయతీల్లో వార్డుల వారీగా ముసాయిదా ఓటర్ల జాబితాలపై ఈనెల 21 వరకు అధికారులు స్వీకరించారు. 589 గ్రామపంచాయతీల్లో మండల స్థాయిలో ఎంపీడీవోలు స్వీకరించిన దరఖాస్తులు జిల్లాలో 922 వరకు అందాయి. అన్ని రాజకీయ పార్టీలు వార్డుల వారీగా ఉన్న లోపాలను, ఓటర్ల తప్పొప్పులు, ఇతరత్రా కారణాలతో అభ్యంతరాలను వ్యక్తం చేశారు. వచ్చిన అభ్యంతరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఇప్పటి వరకు అందిన పిర్యాదుల్లో 688 వరకు పరిష్కరించారు. నేడు రేపు వరకు వీటిపై క్షుణ్ణంగా పరిశీలించి 28న తుది జాబితాను ప్రచురించనున్నారు.

మండలాల వారీగా అందిన అభ్యంతరాలు ఇలా :

మండలం	జీపీలు	అభ్యంతరాలు	పరిష్కరించినవి
బోనకల్	22	11	9
చింతకాని	26	9	7
ఏన్కూరు	25	33	2
కల్లూరు	31	20	10
కామేపల్లి	24	10	6
ఖమ్మంరూరల్	31	9	7
కొణిజర్ల	27	36	36
కూసుమంచి	41	37	35
మధిర	27	154	154
ముదిగొండ	25	14	10
నేలకొండపల్లి	32	13	13
పెనుబల్లి	33	15	11
రఘునాధపాలెం	37	149	90
సింగరేణి	41	15	15
తల్లాడ	27	19	13
తిరుమలయపాలెం	40	271	175
వేంసూరు	26	18	13
వైరా	22	21	14
ఎర్రుపాలెం	31	57	57
మొత్తం	**589**	**922**	**688**

గ్రామాలను నందనవనంగా తీర్చి దిద్దాలి

- జిల్లా పంచాయతీ శాఖ అధికారి చంద్రమౌళి

కరకగూడెం, సెప్టెంబరు 24: పంచాయతీల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపడుతూ గ్రామాలను నందనవనంగా తీర్చి దిద్దాలని డీపీవో చంద్రమౌళి అన్నారు. మంగళవారం మండలంలోని కరకగూడెం, సమత్ భట్టుపల్లి పంచాయతీల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీలలో రికార్డులను పరిశీలించారు. అనంతరం పంచాయతీ సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని.. ఫాగింగ్ చేయాలని రహదారులపై చెత్త వంటివి ఉండకుండా చూడాలని ఆదేశించారు. విధులలో ఆలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జనం బతుకుల్లో చెత్త చిచ్చు

- తీరని సమస్యగా 'చెత్త' వ్యవహారం
- తరలించాలంటూ స్థానికుల నిరసన
- పరిష్కారం అయ్యేదెప్పుడో..



డంపింగ్‌యార్డు తరలించాలంటూ స్థానికుల దీక్షలు

ఖమ్మంటౌన్, సెప్టెంబరు 24: నగరంలోని దానవాయిగూడెం సమీపంలో ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్‌యార్డు పలు డివిజన్ల ప్రజలకు సమస్యగా మారింది. సదరు డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన చెత్తవల్ల తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సమీపంలోని డివిజన్ల ప్రజలు పేర్కొంటున్నారు. దుర్వాసనతో పాటు గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు అంటించటంవల్ల వచ్చే పొగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దానవాయిగూడెం సమీపంలోని డంపింగ్‌యార్డును మార్చాలని గతంలో ప్రజలు ఆందోళన చేయగా, కామంచికల్ సమీపంలో తాత్కాలికంగా డంపింగ్‌యార్డును ఏర్పాటు చేశారు. అయితే సదరు డంపింగ్‌యార్డు ఏర్పాటును అక్కడి గ్రానైట్ కంపెనీలు వ్యతిరేకించి, వాహనాలు రాకుండా గేట్లు వేయటంతో రైతుల పొలాల్లో చెత్తను డంపింగ్ చేయటం ప్రారంభించారు. దీంతో రైతులు పెద్దఎత్తున ఆందోళనలు చేయటంతో మళ్లీ డంపింగ్‌యార్డును దానవాయిగూడెం సమీపంలోనే కొనసాగిస్తున్నారు. నగరంలో రోజుకు సుమారు 200 టన్నులకు పైగా చెత్తను సేకరించి దానవాయిగూడెం డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. తడిచెత్త, పొడిచెత్తగా విభజించి ఎరువులు తయారుచేస్తున్న సేకరించిన చెత్తను ఎరువుగా మార్చేందుకు తగినంత మిషనరీ లేకపోవటంతో చెత్త పెద్దఎత్తున పేరుకుపోతున్నది. ఫలితంగా వర్షాలు వస్తే విపరీతమైన దుర్వాసన వచ్చి సమీపంలోని ప్రజలు ఉండలేని పరిస్థితి నెలకొంది.

సుమారు 35ఎకరాల విస్తీర్ణంలో...

దానవాయిగూడెం సమీపంలో సుమారు 35 ఎకరాల విస్తీర్ణంలో డంపింగ్‌యార్డును ఏర్పాటు చేశారు. చెత్తను తరలించేవాహనాలు రోజుకు రెండు ట్రిప్పులు వంతున తిరుగుతూ సేకరించిన చెత్తను డంప్ చేయాలి. అయితే దూరం ఎక్కువ అవటంతో రెండుసార్లు తిరగకుండా రాపర్తినగర్ బీసీకాలనీ సమీపంలోనే చెత్తను డంప్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోకపోవటంతో చెత్త రహదారుల పక్కన పడుతుందని దీంతో తాము ఇబ్బందులు ఎదుర్కుంటున్నామని చెబుతున్నారు. దానవాయిగూడెం డంపింగ్‌యార్డుకు వెళ్లేందుకు రాపర్తినగర్ బీసీ కాలనీ మీదుగా వెళుతున్న వాహనాలను ఆపు చేసి, తమ నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుతం డంపింగ్‌యార్డును తరలించాలంటూ గత నాలుగురోజులుగా నిరసన దీక్షలు చేస్తున్నారు.

తీరని సమస్య...

డంపింగ్‌యార్డు వల్ల దానవాయిగూడెం, రామన్నపేట, రాపర్తినగర్, బీసీకాలనీ, టీఎన్‌జీవోస్ కాలనీ, రమణగుట్ట, బుర్హాన్‌పురంవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిసినప్పుడు చెత్త తడిసి, విపరీతమైన దుర్వాసన వస్తుంటుంది. చెత్త పేరుకుపోయినప్పుడు కొందరు చెత్తకు నిప్పు పెడుతున్నారు. దీంతో నగరంలోని పలుప్రాంతాల్లో పొగ వ్యాపించి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతుంటారు. నిప్పును ఆర్పటం అధికారులకు తలకుమించిన భారంగా ఉంటున్నది. దీంతో రోజుల తరబడి పొగ సమస్యతో ప్రజలు బాధపడుతున్నారు. గతంలో ఇలాగే పొగ వ్యాపించినప్పుడు శ్వాసకోశ సమస్యతో ఒక యువకుడు మృతిచెందటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. అధికారులు మాత్రం డంపింగ్‌యార్డు సమస్యను పట్టించుకోకపోవటం పలు విమర్శలకు దారితీస్తోంది.డంపింగ్‌యార్డును తరలించాలంటూ రాపర్తినగర్ బీసీకాలనీ సమీపంలో నిరసన దీక్షలు చేస్తున్నారు.

దుర్వాసనతో ఉండలేకపోతున్నాం

దానవాయిగూడెం డంపింగ్‌యార్డు నుంచి వచ్చే దుర్వాసనతో ఉండలేకపోతున్నాం. ఇటీవల కురిసిన వర్షాలకు చెత్త తడిసి వాసన వస్తోంది. మాకు సమీపంలో ఉండటం వల్ల వాసనతో రోగాలు వస్తాయనే ఆందోళన కలుగుతోంది. అధికారులు డంపింగ్‌యార్డు తరలించేవరకు నిరసన దీక్షలు కొనసాగిస్తాం.



పోటు కళావతి, బీసీ కాలనీ

రహదారుల పక్కనే డంప్ చేస్తున్నారు

చెత్తను డంపింగ్‌యార్డు వరకు తీసుకువెళ్లకుండా రహదారుల పక్కనే నిర్లక్ష్యంగా పడవేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు డంపింగ్‌యార్డుకు వెళ్లే రహదారి బురదమయమై వాహనాలు వెళ్లలేక పోయాయి. దీంతో రహదారి పక్కనే చెత్తను పడవేయటం వల్ల ఇళ్లల్లో ఉండే పరిస్థితి లేదు. సీజనల్ వ్యాధులతో అల్లాడుతున్నాం.



సోమయ్య, టీఎన్‌జీవోస్ కాలనీ

పొగతో ఉక్కిరిబిక్కిరి

డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన చెత్తకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటిస్తున్నారు. దీంతో విపరీతమైన పొగ వచ్చి, ఉక్కిరిబిక్కిరి అయి, ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి ఏర్పడుతోంది. చాలా మందికి శ్వాసకోశ వ్యాధులు వచ్చి, ఆస్పత్రుల పాలవుతున్నారు. చెత్త అడుగునుండి నిప్పు పెట్టడంతో దానిని చల్లార్చేందుకు రోజుల సమయం పడుతోంది.



కంకణాల బాబు, టీఎన్‌జీవోస్ కాలనీ

అధికారులు పట్టించుకోవటం లేదు

సమస్యను అధికారులు పట్టించుకోవటం లేదు. డంపింగ్‌యార్డును మారుస్తామని హామీలు ఇస్తున్నారు తప్ప ఆచరణలో చూపటం లేదు. ప్రజలు తీవ్ర ఇబ్బంది పడి నిరసన దీక్షలు చేస్తున్నా పట్టించుకోకపోవటం బాధాకరం. అధికారులు సమస్యను గుర్తించి డంపింగ్‌యార్డును దానవాయిగూడెం నుంచి తరలించాలి.



కూరపాటి విజయ, బీసీ కాలనీ

'ఇందిరమ్మ డెయిరీ' ఏర్పాటులో కదలిక

- లబ్ధిదారుల ఎంపికకు శ్రీకారం
- కార్పొరేషన్‌ల ఆధ్వర్యంలో కులాల వారీగా ప్రారంభమైన సర్వే
- పక్షం రోజుల పాటు కొనసాగే అవకాశం
- గ్రామాల్లో వివరాల సేకరణకు ఇంటింటికి వెళుతున్న అధికారులు
- అర్హులను గుర్తించి వారికి గేదెలు అందజేయనున్న యంత్రాంగం

మధిర, సెప్టెంబరు 24: డిప్యూటీ సీఎం మానస పుత్రిక ఇందిరమ్మ డెయిరీ ఏర్పాటులో కదలిక ఏర్పడింది. అందులో భాగంగా లబ్ధిదారుల ఎంపికకు శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంవ్యాప్తంగా లబ్ధిదారుల ఎంపికకు అధికారులు మంగళవారం సర్వే ప్రారంభించారు. నియోజకవర్గం మొత్తంగా మండలానికి నాలుగు వేల మంది చొప్పున మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ ఐదు మండలాల్లో 20వేల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు గేదెలను పంపిణీ చేసేందుకు అధికారులు నిర్ణయించారు. ఇందు కోసం ఇప్పటికే మహిళా గ్రూపులనుంచి దరఖాస్తులు వచ్చాయి. వీటిలో అర్హులను గుర్తించే పనిని జిల్లా కలెక్టర్ ఆదేశాలపై డీఆర్‌డీఏ చేపట్టింది. లబ్ధిదారుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ ఇలా కులాల వారీగా విభజించి ఆయా కార్పొరేషన్‌ల ఆధ్వర్యంలో విచారణ నిర్వహిస్తున్నారు. ఈ సర్వేలో గుర్తించిన అర్హులకు ఆయా కార్పొరేషన్ ఆధ్వర్యంలో రుణాలు సబ్సిడీపై మంజూరు చేస్తారు.

బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన సర్వే..

కులాల వారీగా సర్వేలో భాగంగా డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ముందుగా బీసీ కార్పొరేషన్ మంగళవారం నుంచి మధిర, బోనకల్ మండలాల్లో సర్వే ప్రారంభించింది. మధిర నియోజకవర్గంలో ఒక్క బీసీ లబ్ధిదారులే 7,511 మంది ఉన్నారు. వీరిని జిల్లా సంక్షేమ అధికారి జ్యోతి ఆధ్వర్యంలో బీసీ వెల్ఫేర్ అధికారులు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం వారికి గేదెలు ఉన్నాయా, పాడిచేస్తున్నారా, షెడ్ ఉందా, ఎన్నిగేదెలు ఉన్నాయి, ఎంతకాలం నుంచి పాడి చేస్తున్నారు, గడ్డి వెసులుబాటు సదుపాయం ఎలా ఉంది, గడ్డి పెంచేందుకు పొలం ఉందా,పాడి గేదెలు కావాలని కోరుతున్నారా, ఇలా వారి అర్హతలను విచారిస్తున్నారు. మధిర మండలంలో బీసీ సంక్షేమ అధికారులు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు తదితరులు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించారు. వచ్చిన దరఖాస్తుల్లో ఒక్క మధిర మండలంలోనే బీసీ లబ్ధిదారులు 1,660మంది ఉన్నారు. ఎస్సీలు 1700 మంది, ఎస్టీలు 160మంది, మైనార్టీలు 130మంది ఉండగా జనరల్ కేటగిరికి చెందిన ఇతరులు 370మంది ఉన్నారు. వీరందరిలో అర్హులను గుర్తించి వారికి మాత్రమే గేదెలు అందజేయనున్నారు.




లబ్ధిదారుల అర్హతను పరిశీలిస్తున్న బీసీ సంక్షేమ శాఖ అధికారులు

15రోజుల్లో సర్వే పూర్తి..

ఇతర మండలాల్లోనూ ఆయా కార్పొరేషన్‌ల ఆధ్వర్యంలో సర్వే చేస్తామని, దరఖాస్తు చేసుకున్నా, లేకున్నా అర్హత ఉన్నవారినే లబ్ధిదారులుగా ఎంపికచేస్తామని డీఆర్‌డీఏ జిల్లా అధికారి సన్యాసయ్య తెలిపారు. అన్ని కులాల వారీగా ఆయా కార్పొరేషన్‌లు ఆధ్వర్యంలో సర్వే జరుగుతుందని 15రోజుల్లో పూర్తిచేయనున్నట్లు, లబ్ధిదారుల విషయంలో అప్పటికి ఒక క్లారిటీ వస్తుందని ఆయన తెలిపారు.

నేటి నుంచి మున్నేరు వరద ముంపు ప్రాంతాల్లో మూడో విడత సర్వే

- మరో 3వేల దరఖాస్తుల పరిశీలనకు రెండు బృందాలు
- ఆరుగురు సిబ్బందిని కేటాయించిన కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 24: మున్నేరు వరద ముంపు ప్రాంతాల్లో బాధితుల గుర్తింపు రోజు రోజుకు ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులకు భారంగా మారుతోంది. ఇప్పటికే 9,500 బాధిత కుటుంబాలకు రూ.16,500 చొప్పున రూ.14 కోట్ల మేరకు ప్రభుత్వం పరిహారం అందించారు. కాగా ముంపు ప్రాంతాల్లో ఇంకా సర్వే చేసి పరిహారం ఇవ్వాలని కార్పొరేటర్ల సిఫార్సుల మేరకు వారం రోజులుగా మున్నేరు పరివాహక ప్రాంతంలోని ప్రజలు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో దరఖాస్తులను అందించారు. ఇలా మూడో విడత వచ్చిన దరఖాస్తులు 3వేలకు పైగా చేరాయి. దీంతో సమస్యను కమిషనర్ అభిషేక్ అగస్త్య, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వివరించారు. కలెక్టర్ ఆదేశాలతో మరో రెండు సర్వే బృందాలను కేఎంసీ అధికారులు ఏర్పాటు చేశారు. ఒక్కో టీంలో ఒక జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు సహాయకులను కేటాయించారు. బుధవారం నుంచి రెండు బృందాల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో సర్వే ప్రారంభించనున్నాయి.

గీత కార్మికులకు అండగా ప్రభుత్వం

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 24: అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో అన్ని కులాలు, వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం నగరంలోని త్రీ టౌన్ ప్రాంతంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గీత కార్మికులకు కాటమయ్య కిట్లును మంత్రి తుమ్మల ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కిట్ల వినియోగంపై గీత కార్మికులకు అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు. ప్రమాదాల నివారణకు కృషి చేయాలని పేర్కొన్నారు. మద్యం దుకాణాల నిర్వాహణ తీరుపై ఎక్సైజ్‌శాఖ నిబంధనల మేరకు పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేంద్రరెడ్డి, సీఐ కృష్ణ, బీసీ వెల్ఫేర్ అధికారి జ్యోతి, కార్పొరేటర్ కమర్తపు మురళి పాల్గొన్నారు.



కల్లు గీత కార్మికునికి కాటమయ్య కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి తుమ్మల

రహదారులకు శంకుస్థాపన

ఖమ్మం నగరంలోని 30వ డివిజన్‌లో సీసీ రహదారులు, డ్రైనేజీ నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశా రు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వందేళ్లలో వరదలకు దెబ్బతిన్న రహదారులు, డ్రైనేజీలు, ఇతర ఆస్తులను తిరిగి మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ యర్రం బాలగంగాధర్‌తిలక్, కార్పొరేటర్లు పాలేపు విజయవెంకటరమణ, మిక్కిలినేని మంజుల, సరిత పాల్గొన్నారు.

ప్రకాశ్‌నగర్ వంతెన పరిశీలన

మున్నేరు వరద పోటుతో కదిలిన ప్రకాశ్‌నగర్ వంతెనను మంత్రి తుమ్మల ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. సమీప ప్రాంతాల ప్రజల రాకపోకలకు రవాణా ఇబ్బందులు త్వరగా పరిష్కారం చేయాలని, రహదారులు, భవనాలశాఖ అధికారులను ఆదేశించారు. మరమ్మతుల వరకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని సూచించారు. మూడు నెలల లోపుగా శాశ్వత మరమ్మతులు చేపట్టి వంతేనను రవాణాకు అనుకూలంగా మార్చాలని ఆదేశించారు. మే యర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య, కార్పొరేటర్ కొప్పెర సరిత, సాధు రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా సమితి సభ్యుడు మహ్మద్ సలామ్‌ను మంత్రి తుమ్మల పరామర్శించారు. ఇటీవల సలామ్ అనారోగ్యానికి గురికావడంతో మంత్రి తుమ్మల మాట్లాడారు. ఆరోగ్య విషయాలను తెలుసుకున్నారు.

వెయిట్ లిఫ్టర్ వంశీకి సాయం అందజేత

భద్రాచలం, సెప్టెంబరు 24: అంతర్జాతీయ వెయిట్ లిఫ్టర్ వంశీకి వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు రూ.30 వేల చెక్కును మంగళవారం హైదరాబాద్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెయిట్ లిఫ్టింగ్‌లో రాణిస్తున్న వంశీ రాబోయే కాలంలో మరిన్ని పతకాలు దేశానికి తేవాలని ఆకాంక్షించారు. భద్రాచలం ఏజెన్సీ ప్రాంతం నుంచి అంతర్జాతీయస్థాయికి ఎదిగి వెయిట్ లిఫ్టింగ్‌లో పతకం సాధించడం నిజంగా ఏజెన్సీకి గర్వకారణమన్నారు. ఏజెన్సీలో విద్య, వైద్య రంగాల్లో తమవంతు ఆర్థిక చేయూతనందిస్తున్న వసుధ ఫౌండేషన్ క్రీడారంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే వారికి సైతం తనవంతు సహకారం అందిస్తుందని ఆయన తెలిపారు. అలాగే బోనకల్లు మండలం రావినూతల గ్రామానికి చెందిన చేబ్రోలు యశ్వంతి మెదడులో నరాల వ్యాధితో బాధపడుతుండగా వైద్య ఖర్చుల కోసం రూ.30 వేలను వసుధ ఫౌండేషన్ చైర్మన్ వెంకటరామరాజు అందజేశారు.



వంశీకి చెక్కును అందజేస్తున్న వెంకటరామరాజు

దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు24: నగరంలోని టేకులపల్లిలోల మహిళా ప్రాంగణం నందు ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా శిక్షణ అందిస్తున్నట్లు ప్రాంగణం అధికారి వేల్పుల విజేత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన మహిళా అభ్యర్థులు శిక్షణ నందు సర్టిఫికెట్లు ఉన్నవారు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రారంభంకానున్న శిక్షణలు టైలర్(దర్జీ), బుట్టలు, చీపుర్లుతయారీ, బ్యూటీషియన్, బొమ్మల తయారీ ఈ శిక్షణా కాలం కేవలం ఆరు రోజులు మాత్రమేనని తెలిపారు. ఈశిక్షణ పొందనున్న వారికి రూ.4వేల స్టైఫండ్‌తోపాటు రూ.15 వేల విలువగల టూల్‌కిట్లు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ దరఖాస్తులను ఈ నెల 28 లోగా జిల్లా మహిళా ప్రాంగ ణం టేకులపల్లిలో అందించాలని తెలిపారు. వివరాలకు 76600 22512 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

మహిళా అతిథి అధ్యాపక పోస్టులకు...

నగరంలోని టేకులపల్లిలోగా మహిళా ప్రాంగణంలో మహిళా అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంగణం అధికారి విజేత తెలిపారు. టైలర్, బ్యూటీషియన్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 28లోగా దరఖాస్తులను అందించాలని తెలిపారు. పదో తరగతి ఆపైన విద్యార్హత కలిగిన వారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 76600 22512 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

ఓపెన్ స్కూల్ తత్కాల్ పరీక్ష ఫీజుకు గడువు పెంపు...

ఖమ్మం ఖానాపురంహవేలి సెప్టెంబరు24: ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు అర్హత ఉండి నేటికీ పరీక్ష ఫీజు చెల్లించని వారికి ప్రభుత్వం ప్రత్యేకంగా తత్కాల్ స్కీం ద్వారా సాధారణ పరీక్ష ఫీజుతో పాటు అదనంగా ఫీజు కట్టుకునేందుకు ఈ నెల 25, 26 తేదీలలో అవకాశం కల్పించిందని డీఈవో సోమశేఖర శర్మ, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ పాపారావులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతికి సాధారణ ఫీజుతో పాటు అదనంగా రూ.500లు, ఇంటర్మీడియట్‌కు సాధారణ ఫీజుతో పాటు రూ. 1000లు చొప్పున మీసేవ, టీజీ ఆన్‌లైన్లో ఫీజు చెల్లించాలని తెలిపారు.

ఖమ్మం మెడికల్ కళాశాలలో 96 శాతం ఎంబీబీఎస్ ఫలితాలు

- విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 24: ఖమ్మం మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి వార్షిక పరీక్షల్లో నూటికి నూరుశాతం ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి ఏడాదితో మొత్తం 99 మంది పరీక్షలకు హాజరు కాగా, ముగ్గురు డిస్టింక్షన్‌లో, 61 మంది ప్రథమ శ్రేణిలో, 33 మంది సెంకడ్ క్లాస్‌లో ఉత్తీర్ణులైనట్లు ఆయన తెలిపారు. మరో ఇద్దరి ఫలితాలు విత్‌హెల్డ్‌లో ఉన్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

ఆర్టీసీ డ్రైవర్లు అప్రమత్తతతో ఉండాలి: ఆర్ఎం

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 24: రహదారులపై ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ఆర్టీసీ డ్రైవర్లు అందరూ అనుక్షణం అప్రమత్తతతో ఉండాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సరిరాం అన్నారు. మంగళవారం నగరంలోని సీటీ బస్టాండ్ ఆవరణలోని ఆర్ఎం కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు డిపోలలోని డ్రైవర్లకు సేఫ్టీ డ్రైవింగ్ శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ మేనేజర్ (మెకానికల్)ఎస్ భవాని ప్రసాద్, డ్రైవర్లు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలపై అవగాహన కల్పించండి

- జిల్లా పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి

పినపాక, సెప్టెంబరు24: పోస్టల్ (తపాల)శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఖమ్మం జిల్లా పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ (ఎస్‌పీ)వీరభద్రస్వామి అన్నారు. ఈ సందర్భంగా ఏడూళ్లబయ్యారంలో ఏర్పాటు చేసిన బ్రాంచ్ పోస్టమాస్టర్(బీపీఎం)లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోస్టల్ శాఖ పేమెంట్ బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ మేనేజర్ రాజేష్, మణుగూరు సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ రామ్మూర్తి, ఎంవోలు సత్యనారాయణ, సుధీర్ తదితరులున్నారు.

319 కేజీల గంజాయి పట్టివేత

- పట్టుబడ్డ గంజాయి విలువ రూ.కోటి ఉంటుందని అంచనా
- 10 మంది నిందితుల అరెస్టు
- అరెస్టయిన వారిలో తల్లీ, కుమారుడు



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి

భద్రాచలం, సెప్టెంబరు 24: భద్రాచలం ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో ఒకే రోజు ఐదు సంఘటనల్లో రూ.కోటి విలువైన 319 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ డిప్యుటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి వెల్లడించారు. భద్రాచలంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ డిప్యుటీ కమిషనర్ వివరాలను వెల్లడించారు. హైదరాబాద్‌లోని బేగంబజార్‌కు చెందిన దత్తు పంచాల్ అనే వ్యక్తి 180 కేజీలు, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన నేరెళ్ల అపర్ణ, ఆమె కుమారుడు అఖిల్‌లు 100కేజీల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. ఆదేవిధంగా హైదరాబాద్‌కు చెందిన శక్తి రాహుల్, గోపిశెట్టి అక్షిత్‌లు 14 కేజీల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. అలాగే మరో కేసులో 20కేజీల గంజాయిని తరలిస్తుండగా ఒడిశాలోని మల్కనగిరికి చెందిన గణేష్, శేఖర్ చౌదరిలను, ఐదు కిలో గంజాయిని తరలిస్తుండగా ఏపీలోని గుంటూరుకు చెందిన బనిగెల మహేష్, బాపట్లకు చెందిన చేగుడి దినేష్‌లను పట్టుకున్నారు. భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వేర్వేరు చోట్ల పట్టుబడ్డ వీరందరూ మునవర్ ఆలీ కోసమే గంజాయి తరలిస్తూ ఒకే రోజు పట్టుబడినట్లు తెలిపారు. ఆయా కేసుల్లో పదిమందిని అరెస్టు చేసి రెండుకార్లు, మూడుబైక్‌లు, తొమ్మిది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గంజాయి స్మగ్లర్లు మునవర్ ఆలీ, దాత్తూ పంచాల్ అనే వ్యక్తులను అరెస్టు చేయగా, మునవర్ ఆలీపై ఇప్పటికే తొమ్మిది కేసులు ఉన్నట్లు గుర్తించామన్నారు. అలాగే మరో కేసులో తల్లి కుమారులు నేరెళ్ల అపర్ణ, అఖిల్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. గంజాయి స్మగ్లర్లను పట్టుకున్న భద్రాచలం సీఐలు రహీమున్నీసాబేగం, ఎస్. రమేష్, ఎస్ఐలు కే. గౌతం, అల్లూరి సీతారామరాజు, హెడ్ కానిస్టేబుల్ సయ్యద్ అలీ, కానిస్టేబుళ్లు కే. బాబు, వీరబాబు, రాకేష్, కిరణ్‌కుమార్, నాగేశ్వరరావులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి అభినందించారు.

ఆ కుటుంబంలో అందరూ గంజాయి స్మగ్లర్లే

అవును మీరు చదివింది అక్షరాల వాస్తవమే.. ఆ కుటుంబంలో అందరూ గంజాయి స్మగ్లర్లే.. తండ్రి, తల్లి, కుమారుడు గంజాయి అక్రమ వ్యాపారం సాగిస్తూ ఇప్పటికే మూడు రాష్ట్రాల్లో ఎన్నో కేసుల్లో పట్టుబడినట్లు ఎక్సైజు అధికారులే పేర్కొంటున్నారు. తాజాగా మంగళవారం భద్రాచలం మీదుగా 100 కేజీల గంజాయి స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడటం గమనార్హం. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన నేరెళ్ల అపర్ణ, ఆమె కుమారుడు అఖిల్ ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల నుంచి కారులో 100 కేజీల గంజాయిని తరలిస్తూ భద్రాచలంలో పట్టుబడ్డారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే అపర్ణ భర్త సదయ్య అనేక గంజాయి కేసుల్లో ఇప్పటికే నిందితుడని అధికారులు తెలిపారు. నేరెళ్ల సదయ్య, మునవర్ ఆలీలతో చేతులు కలిపి గతంలో గంజాయి వ్యాపారం చేయగా 2017లో విజయవాడ భవానీపురం పోలీసుస్టేషన్‌లో గంజాయి కేసులో అరెస్టై జైలుకెళ్లారు. అయినా వారు తమ తీరు మార్చుకోకుండా మహారాష్ట్ర, తెలంగాణల్లో గంజాయి వ్యాపారం చేస్తూ పలుమార్లు పట్టుబడుతూ ఇదే వృత్తిని కొనసాగిస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసు ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. వీరు ఏవోబీ నుంచి తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలకు సరఫరా చేసి రూ.కోట్లు గడించినట్లు అధికారులు తెలిపారు.

ఎన్నెస్పీ వైరా మేజర్ ఆక్రమణ

వైరా, సెప్టెంబరు 24: నిరుపయోగంగా ఉన్న ఎన్నెస్పీ వైరా మేజర్ కాల్వ స్థలాన్ని ఆక్రమిస్తూ సోమవారం రాత్రికి రాత్రే కొంతమంది హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటికే ఎన్నెస్పీ కాల్వ స్థలాలు భారీగా కబ్జాకు గురయ్యాయి. అయితే రైతువేదిక సమీపంలోని ఎన్నెస్పీ కాల్వ స్థలంపై స్థానికులు కొంతమంది స్థలాలు ఆపుకుంటూ హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. ఆస్థలం హద్దుల కోసం చీరలు, తాళ్లు ఏర్పాటు చేశారు. కొద్ది రోజుల నుంచి వైరా మేజర్ ఎన్నెస్పీ స్థలాల్లో కొంతమంది నిర్మాణాలు చేపట్టారు. అధికార పార్టీకి చెందిన కొంతమంది ఈ ఎన్నెస్పీ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టడంతో తాము కూడా ఈ స్థలాలను ఆక్రమించుకొని నివాసాలు నిర్మించుకొనేందుకు కొంతమంది ఈ చర్యకు పాల్పడ్డారు. వైరా మేజర్ కాల్వలోని ఎన్నెస్పీ స్థలంలో ఇప్పటికే ప్రభుత్వం రైతువేదికను, పట్టణ దవాఖానా భవనాన్ని నిర్మించింది. ఇటీవల ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న కేవీసీఎం విద్యాసంస్థల స్థలంలో కూడా కొంత ఎన్నెస్పీ స్థలం కలిసి ఉంది. అంతేకాకుండా ఐదారు వార్డుల పరిధిలో అనేకమంది శాశ్వత నిర్మాణాలు చేసుకున్నారు. ఇప్పటికే ఈ ఎన్నెస్పీ స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టినా ఎలాంటి చర్యలు లేకపోవడంతో యథేచ్ఛగా ఆక్రమణల పర్వం కొనసాగుతుంది. ఆక్రమణదారులకు కొంతమంది నాయకుల ప్రోత్సాహం కూడా ఉందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఇప్పటికైనా నీటిపారుదల, రెవెన్యూ, మునిసిపల్ అధికారులు సమన్వయంతో ఎంతో విలువైన ఎన్నెస్పీ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు.



ఎన్నెస్పీ వైరా మేజర్‌లో హద్దుల కోసం కట్టిన చీరలు

అలోచన అదుర్స్..

ప్లాస్టిక్ బాటిళ్ల పునరుపయోగంలో ముందడుగు



బాటిళ్లను ఇటుకల్లా ఏర్పాటు చేస్తున్న కార్యదర్శి భవానీ

బూర్గంపాడు, సెప్టెంబరు 24: పర్యావరణానికి ప్లాస్టిక్ బాటిళ్లు ముప్పు కలిగించేవి అని తెలిసిన ఓ గ్రామ పంచాయతీ కార్యదర్శి వాటిని భద్రం చేసి పునరుపయోగించారు. మండల పరిధిలోని మోరంపల్లిబంజర గ్రామపంచాయతీ కార్యదర్శి భవాని ప్లాస్టిక్ బాటిళ్లను పంచాయతీ కార్యాలయంలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం చుట్టూ అలంకరణకు ఉపయోగించారు. మహిళ సంఘా లు, పంచాయతీ సిబ్బంది సహకారంలో ప్లాస్టిక్ కవర్లును బాటిళ్లలో నింపి వాటిని ఇటుకల్లా వినియోగించారు. ఈ ఫొటోను కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సోషల్ మీడియా వేదికగా తన వ్యక్తిగత ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసి అభినందనలు తెలిపారు. పర్యావరణ కాలుష్యం నివారణలో భాగంగా ఏకోఫ్రెండ్లీ బ్రిక్స్ ఏర్పాటు చేసినట్లు భవానీ తెలిపారు.

పాముకాటుతో రైతు మృతి

తల్లాడ, సెప్టెంబరు 24: పాముకాటుకు గురై చికిత్స పొందుతూ మండలంలోని గాంధీనగర్ తండాకు చెందిన కౌలు రైతు బోడా తావు అలియాస్ చిన్ననర్సింహ(48) మృతి చెందాడు. ఈనెల 17వతేదీన కౌలుకు తీసుకున్న వరి పొలంలో ఎరువు చల్లుతుండగా పాము కాటు వేసింది. దీంతో అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళ వారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సాతానిగూడెంలో మహిళ ....

కామేపల్లి, సెప్టెంబరు 24: పాముకాటుకు గురై మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని సాతానిగూడెంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాతానిగూడేనికి చెందిన కొండమీది సుగుణ (58) సోమవారం సాయంత్రం కిరాణ షాపునకు వెళ్లి వస్తుండగా, రోడ్డు మీద ఓ పాము కాటు వేసింది. అది గమనించిన ఆమె కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందేలోపే ఆమె మృతి చెందింది. కుమారుడు కొండమీద రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ నూరుద్దిన్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి.....

కామేపల్లి, సెప్టెంబరు24: రోడ్డు ప్రమాదంలో గాయపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని మద్దివంచలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గార్ల మండలం మద్దివంచ గ్రామానికి చెందిన కట్టబోయిన వెంకటరత్నం(42) అతని భార్య పద్మ ఇరువురు బైక్‌పై ఈనెల 8న సాతానిగూడెంలోని బంధువు బొరిగొర్ల సురేష్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయనను కడసారి చూసేందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన అభినవ్ అనే వక్తి తన బైక్‌తో ఎదురుగా వచ్చి వారిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటరత్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రవి తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు....

నేలకొండపల్లి, సెప్టెంబరు24: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చెర్వుమాధారం గ్రామంలో మంగళవారం జరిగింది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పరిటాల లింగయ్య(56) పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి మోటరు వేయటానికి ప్రయత్నించగా ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలిపోయాడు. వ్యవసాయ మోటార్‌కు విద్యుత్ కనెక్షన్ ఉన్నదీ..లేనిదీ తెలియదు. విద్యుత్ తీగల నుంచి విద్యుత్ మోటార్‌కు వైరు తగిలిస్తుండగా విద్యుత్ షాక్ తగిలినట్లుగా సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు.

గుండెపోటుతో అంగన్‌వాడీ టీచర్...

ఖమ్మం ఖానాపురంహవేలి సెప్టెంబరు 24: గుండెపోటుతో అంగన్‌వాడీ టీచర్ ఝాన్సీ(52) మృతి చెందిన సంఘటన మంగళవారం నగరంలో జరిగింది. ఖమ్మం అర్బన్ ప్రాజెక్ట్ ద్వారకానగర్ సెక్టార్ బుర్హాన్‌పురం అంగన్‌వాడీ కేంద్రం-2 టీచర్ ఝాన్సీ మంగళవారం తెల్లవారుజామున నగరంలోని బస్‌డిపో రోడ్‌లోని ఆమె నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. ఆమె భర్త కూడా ఇటీవల మృతి చెందారు. ముగ్గురు ఆడపిల్లలు ఉండ గా, వారికి పెళ్లిళ్లు అయ్యాయి. ఆమె దహన సంస్కారాలకు అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు కొంత ఆర్థిక సహాయం అందించారు.



ఝాన్సీ(ఫైల్)

ముద్దునూరు మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి..

తల్లాడ, సెప్టెంబరు 24: తల్లాడ మండలం ముద్దునూరు మాజీ సర్పంచ్, సొసైటీ డైరెక్టర్, మండల కాంగ్రెస్ నాయకుడు రంగాపురం గ్రామానికి చెందిన యరమల వెంకటేశ్వర్ రెడ్డి(57)గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వెంకటేశ్వర్‌రెడ్డి తెలుగుదేశం పార్టీలో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి టీడీపీ, బీఆర్ఎస్ పార్టీల్లో కీలక పదవులు నిర్వర్తించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. 2001నుంచి 2006 వరకు తిరిగి 2013నుంచి 2018వరకు రెండుసార్లు ముద్దునూరు గ్రామపంచాయతీ సర్పంచ్‌గా, 2009నుంచి 2014వరకు టీడీపీ మండల అధ్యక్షుడిగా, 2014నుంచి 2018వరకు రైతుసమన్వయసమితి(రైతుబంధు) మండల కోఆర్డినేటర్‌గా పనిచేశారు. 2020 ఫిబ్రవరి నుంచి కుర్నవల్లి సొసైటీ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డిలతో వెంకటేశ్వర్‌రెడ్డికి పరిచయాలు ఉన్నాయి. బుధవారం ఉదయం రంగాపురంలో వెంకటేశ్వర్‌రెడ్డి అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.



వెంకటేశ్వర్‌రెడ్డి

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

- ఇద్దరు మావోయిస్టులు మృతి

చర్ల, సెప్టెంబరు23: ఛత్తీస్‌గడ్ రాష్ట్రం సుకుమా జిల్లా అటవీ ప్రాంతంలో మంగళవారం ఉదయం మావోయిస్టులు, పోలీసులు మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టుల కదలికల నేపథ్యంలో పోలీసులు చింతల్నార్ అడవుల్లో కూబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో చింతవాగు సమీప అడవుల్లో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలం నుంచి మావోయిస్టులకు చెందిన తుపాకులను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్, ఇతర బలగాలు ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్నాయి. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది.

రేషన్ బియ్యం పట్టివేత

జూలూరుపాడు, సెప్టెంబరు 24: మండలంలోని పాపకొల్లు పంచాయతీ పరిధిలోని బీమ్లాతండా గ్రామంలో ఓ వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన బియ్యాన్ని పట్టుకొని సీజ్ చేసినట్లు సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ ఆర్ఐ ఎస్.వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. బీమ్లాతండా గ్రామానికి చెందిన వాంకుడోత్ రఘు అనే వ్యక్తి ప్రజల వద్ద నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, తన ఇంటిలో నిల్వ చేశాడు. నమ్మదగిన సమాచారం మేరకు సోమవారం రాత్రి దాడులు నిర్వహించగా, 5 క్వింటాల బియ్యం పట్టుబడగా, వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు. సదరు వ్యక్తిపై 6ఏ కేసును నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

చంద్రుగొండ, సెప్టెంబరు24: విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయబోయిన కాంట్రాక్టు విద్యుత్ ఉద్యోగికి గాయాలైన సంఘటన చంద్రుగొండలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రుగొండలో జరుగుతున్న డ్రైనేజీ పనులకు విద్యుత్ వైర్లు అడ్డువచ్చాయి. వాటిని తొలగించే పనిలో భాగంగా విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్న సమయంలో కాంట్రాక్టు విద్యుత్ ఉద్యోగి చాపలమడుగు వెంకటేశ్వర్లు విద్యుత్ షాక్‌కు గురై స్వల్పగాయాలతో బయట పడ్డాడు. వెంటనే అతడిని సహచర సిబ్బంది స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్

WANTED

ఖమ్మం శ్రీ చైతన్య విద్యాసంస్థల జూనియర్ కళాశాలలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. కావలసిన ప్రాంతాలు సత్తుపల్లి, భద్రాద్రికొత్తగూడెం జిల్లా అన్ని మండలాలు. ఫోన్ : 8888518151, 7995760654, 9951977755

AJM-331

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజా నిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, లేక వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

స్వదేశాగమనము/ విదేశీయానం.
పుట్టిన రోజు
వివాహ వార్షికోత్సవం
షష్టిపూర్తి
లీగల్ నోటీసులు
శ్రద్ధాంజలి
పదవీవిరమణ

వ్యాపార ప్రకటనల కోసం సంప్రదించవలసిన నెంబర్లు

ఖమ్మం : 9985401672

4 Lines Classifieds
Khammam + B-Kothagudem Dists
220/- Only
Extra Line 45/- only

ఖమ్మం
9985406151
9985401698

కొత్తగూడెం: 9985400885
భద్రాచలం: 9985411347

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
8
బుధవారం 25 సెప్టెంబరు 2024

భద్రాద్రి
కొత్తగూడెం

'భద్రాద్రి సమస్యలపై మరో పోరాటం తప్పదు'

భద్రాచలం, సెప్టెంబరు 24: భద్రాచలం సమస్యలపై మరో పోరాటం తప్పదని టీజేఎస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు అన్నారు. భద్రాచలంలో మంగళవారం టీజేఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి అనంతరం తిప్పన సిద్దులు నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రాలో విలీనమైన ఐదు పంచాయతీల ను తెలంగాణలో కలపాల్సిందేన్నారు. ఐదు పంచాయతీల విలీనం ద్వారా దేవస్థానం భూములు తిరిగి తెలంగాణలో కల పడం వలన ఆలయ అభివృద్ధికి మరింత దోహదపడుతుందని వివరించారు. భద్రాచలంలో చెరువులు, ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురయ్యాయని హైడ్రా తరహా చర్యలు ఇక్కడ చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం టీజేఎస్ భద్రాచలం నియో జకవర్గ కోఆర్డినేటర్లుగా పూనెం ప్రదీప్‌కుమార్, ఆర్.రామారావులను నియమించి సభ్యత్వ పుస్తకాలను అందజేశారు. ఈ కార్య క్రమంలో జిల్లా అధ్యక్షుడు దేవదానం, నాగేశ్వరరావు, మూల నాగిరెడ్డి, నబీ సాహెబ్ , వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖకు దిక్కెవరు..?

పేటలో ఏడీ, ఏఈ, సిబ్బంది లేక అల్లాడుతున్న విద్యుత్‌శాఖ

అశ్వారావుపేట మండలంలో దుర్భర పరిస్థితి

నిత్యం సమస్యలతో అల్లాడుతున్న వినియోగదారులు

సిబ్బందికి ఊహించని కష్టాలు..కరెంటు పోతే అవస్థలే

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 24: అశ్వారావుపేట విద్యుత్ శాఖలో సిబ్బంది కొరత వేధిస్తోంది. పర్యవేక్షణ అధికారులు మొదలు వి ద్యుత్ స్తంభం ఎక్కే సిబ్బంది వరకు అంతా కొరతే. అశ్వారావుపేట మం డలంలో అశ్వారావుపేట, గంగారం, వినాయకపురం, నారంవారిగూడెం, నారాయణపురం సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వీటి పరిధిలో దాదాపు 50వేల విద్యుత్ కనెక్షన్లు, మరో 10వేల వరకు వ్యవసాయ మోటార్లు ఉన్నాయి. వందల కిలో కిలోమీటర్ల విద్యుత్ లైన్లు ఉన్నాయి. వీటన్నింటిని పర్యవే క్షించాలంటే తప్పనిసరిగా ఉన్నతాధికారులు ఉండాలి. కాని అశ్వారావుపే టలో ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా ఉంది. ఇక్కడ పనిచేసిన ఏడీ పదో న్నతిపై కొత్తగూడెం వెళ్లారు. నెలరోజులుగా ఇన్‌చార్జ్ ఏడీనే విధులు ని ర్వహిస్తున్నారు. మే నెలలో ఇక్కడ పనిచేసిన ఏఈ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. పేటలో ఉన్న పరిస్థితి నేపధ్యంలో వెంటనే రెగ్యులర్ ఏఈ ని నియమించాలి. కాని ఉన్నతాధికారులు ఆపని చేయలేదు. దీంతో వినా యకపురం సబ్‌స్టేషన్ ఏఈ పేటకు ఇన్‌చార్జీగా వ్యవహరిస్తున్నారు. మం



అశ్వారావుపేట ఏడీఈ కార్యాలయం

డలం మొత్తానికి ఒకే ఒక ఏఈ ఉన్నారు. ఇది ఏఈకి భారంగానే ఉంటు ంది. అశ్వారావుపేట సబ్‌స్టేషన్‌లో ఇద్దరు లైన్‌మెన్‌లు ఉన్నాయి. ప్రస్తు తం ఒక్కరు కూడా లేరు. గతంలో నలుగురు జేఎల్‌ఎంలు ఉండగా అం దరూ ఏఎల్‌ఎంగా ప్రమోషన్ పొంది ఇక్కడే పనిచేస్తున్నారు. అంటే నలు గు జూనియర్ లైన్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పట్టణానికి సంబం ధించిన లైన్‌మెన్ పోస్టు ఏడేళ్లగా ఖాళీగా ఉంటుంది. వినాయకపురం స బ్‌స్టేషన్‌లో నలుగురు లైన్‌మెన్‌లు కావాలి. ప్రస్తుతం నాలుగు ఖాళీగానే ఉన్నాయి. జూనియర్ లైన్‌మెన్ పోస్టులు నాలుగు ఖాళీగానే ఉన్నాయి.

లైన్ ఇన్స్పెక్టర్ పోస్టు ప్రస్తుతం ఖాళీగానే ఉంది. క్షేత్రస్థాయిలో పనిచేయ టానికి సిబ్బంది లేకపోవటంతో ఉన్న సిబ్బందే నానా ఇబ్బందులు పడు తూ విధులు నిర్వహిస్తున్నారు.

సబ్‌స్టేషన్లలో పరిస్థితి దారుణం

మండలంలో ఆరు సబ్‌స్టేషన్లు ఉన్నాయి. ఆయా సబ్‌స్టేషన్లలో నలు గురు సిబ్బంది తప్పనిసరిగా ఉండాలి. అయితే ఏ సబ్‌స్టేషన్‌లోనూ పూ ర్తిస్థాయిలో సిబ్బంది లేరు. అశ్వారావుపేటలో నాలుగు ఆపరేటర్ పోస్టు లు ఖాళీగానే ఉన్నాయి. అయితే తప్పనిసరిగా సిబ్బంది ఉండాల్సి ఉండ టంతో ఒక విశ్రాంత ఉద్యోగి, గంగారం సబ్‌స్టేషన్ జేఎల్‌ఎం, ఒక ఆర్టిజ న్ విధులు నిర్వహిస్తున్నారు. గంగారం సబ్‌స్టేషన్‌లో నలుగురు ఉండగా ఇద్దరిని దమ్మపేట మండలంలోని గండుగులపల్లికి పంపారు. మరో ఇద్ద రితో పాటు అశ్వారావుపేట ఏఎల్‌ఎం ఒకరు ఇక్కడ విధులు నిర్వహిస్తు న్నారు. నారంవారిగూడెం సబ్‌స్టేషన్‌లో నలుగురు ఉండగా ఇద్దరిని గం డుగులపల్లికి పంపారు. అశ్వారావుపేట నుంచి మరొక ఉద్యోగిని అక్కడ కు పంపి ఆపరేట్ చేయిస్తున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన నారాయణపు రం సబ్‌స్టేషన్‌లో ఒక్కరూ లేకపోవటంతో ఏఎల్‌ఎం, ఆర్టిజియన్‌తో పని చేయిస్తున్నారు. విద్యుత్‌శాఖలో క్షేత్రస్థాయి సిబ్బందికి సెలవు లేకుండా పోతుంది. ఇందుకు ప్రధాన కారణం ఆ శాఖను వేధిస్తున్న సిబ్బంది కొ రత. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, ప్రజల ఇబ్బందులను దృ ష్టిలో ఉంచుకుని పూర్తిస్థాయిలో సిబ్బందిని కేటాయించాలని వినియోగ దారులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

కార్మికులను మోసం చేసిన ప్రభుత్వం


ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఇల్లెందు సెప్టెంబర్ 24: సింగరేణిలో కార్మికులు కష్టపడి సంపాదించిన లాభాలను తక్కువ చూపి లాభాల బోనస్ లో కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం ఆందోళన నిర్వహించి ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేశారు. జగదాంబ సెంటర్ తెలంగాణా తల్లి విగ్రహం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకులు దిండిగాల రాజేందర్, టీబీజీకేఎస్ నాయకుడు రంగనాథ్ మా ట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో సింగరేణి కాలరీస్‌కు లభించిన మొత్తం నికర లాభం నుంచి కార్మికులకు బోనస్ చెల్లించడం జరిగిందని అన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం 4701 కోట్ల రూపాయల నికర లాభాల్లో అనేక రకాల మినహా యిం పులు చేసి తక్కువ చూపి కార్మికులను మోసం చేసిందని ఆరోపించారు. కా ర్మికు లకు బోనస్ మొత్తం సింగరేణి లాభాల నుండి 33 శాతం చెల్లించాలని డి మాం డ్ చేశారు. ఈ ఆందోళనలో కౌన్సిలర్ జే కే శ్రీనివాస్. బీఆర్ఎస్ నాయకులు సిలివెరి సత్యనారాయణ. శీలం రమేష్, నబీ, పరుచూరి వెంకటేశ్వరరావు. రాంలాల్. గిన్నరపు రాజేష్ దేవీలాల్ బజారు సత్యం తదితరులు పాల్గొన్నారు

కార్మికుల కష్టార్జితాన్ని దోచారు

మణుగూరు: ప్రభుత్వం కార్మికుల కష్టార్జితాన్ని దోచిందని ఆరోపిస్తూ సింగరే ణి కాలరీస్ మణుగూరు ఏరియాలో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. కూనవరం రైల్వే గేట్ ప్రాంతంలో ఈ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు నాగెల్లి వెంకట్ మాట్లాడు తూ.. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ ఈ ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇజ్రాయిల్, బం గారి పవన్‌కుమార్, మునిగెల నాగేశ్వరరావు, మస్తాన్, ముకేష్, ఇమ్రాన్, శ్రీకాం త్, మురళీకృష్ణ, భరత్, సురేష్ నాయుడు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.


మణుగూరులో నిర్వహించిన ఆందోళన

'విద్యార్థులు సేవాభావంతో మెలగాలి'



మాట్లాడుతున్న హేమంత్ కుమార్

అశ్వారావుపేట, సెప్టెంబరు 24: విద్యార్థులు సేవాభావంతో మెలగాలని, విద్యతో పాటు సమాజ సేవకు ఉపయోగపడాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. హేమంత్‌కుమార్ అన్నారు. మంగళవారం జాతీయ సే వా పథకం దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీన్ మా ట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, చెట్ల పెంపకం, ఆరోగ్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, అవగాహన సదస్సులో విద్యార్థులు విరివిగా పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ప్రొఫెసర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ దేశసేవలో విద్యార్థులు చురు కుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో జరి గిన వివిద కార్యక్రమాలలో పాల్గొని అత్యున్నత ప్రతిభను కనపరచిన ఎన్ ఎస్ఎస్ సేవకులను కళాశాల సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో డా. రాం ప్రసాద్, డా. శ్రావణ్ కుమార్, డా. రెడ్డి ప్రియ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి: ఎస్పీ రోహిత్ రాజు

లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 24: వివిధ సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వ చ్చే బాధితులకు సత్వరన్యాయం చేకూరేలా చూడాలని, బాధ్యతగా వి ధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ తెలిపారు. మంగళ వారం లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో నమోదైన పలు కేసులు వివరాలను అడిగి తెలుసు కున్నారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాలు జరగకుండా నిత్యం పెట్రోలింగ్ చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచిం చారు. సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగేవిధంగా ప్రవర్తించే ఆ కతాయిల పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అదే సమ యంలో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధితులను వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తూ మ ద్యం సేవించి వాహనాలను నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల ని తెలిపారు. అనంతరం సిబ్బంది సమస్యలు తెలుసుకుని వాటి పరి


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ రాజు

ష్కారానికి కృషిచేస్తామన్నారు. బాధితులకు సత్వర న్యాయం చేసే లా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎస్పీ వెంట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రమణారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి ఎంఎల్ఏ నివాళి

దుమ్ముగూడెం సెప్టెంబరు 24:ఆర్లగూడెం మాజీ సర్పంచ్ కొర్సా రమేష్ మృతిపట్ల ఎమ్మెల్యే డాతెల్లం వెంకట్రావు నివాళులర్పించారు. గుండెపోటుతో మృతిచెందిన రమేష్ భౌతిక దేహాన్ని మంగళవారం సందర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. సొసైటీ ఛైర్మన్ కిలిమి ఎల్లారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాంప్రసాద్, సీపీఐ నాయకులు రావు లపల్లి రవికుమార్, కాంగ్రెస్ నాయకులు లంకా శ్రీనివాసరావు, శివాజీ, సీతమ్మ, బాలాజీ, చంటి తదితరులున్నారు.

కళాశాలలో ఎన్ఎస్ఎస్ డే

దుమ్ముగూడెం, సెప్టెంబరు 24: దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళా శాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ డే నిర్వహించారు. వాలంటీర్లు సేవా కార్య క్రమాలు, వరద సహాయక చర్యలు, జాతర్లలో చురుగ్గా పాల్గొనాలని ప్రిన్సి పల్ కృష్ణవేణి సూచించారు. ఎన్ఎస్ఎస్ డే ప్రాముఖ్యతను వివరించారు. ప్రోగ్రాం అధికారి మల్లెల శ్రీనివాసరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీ హోంమంత్రికి బీఆర్ఎస్ సన్మానం


అనితను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బూర్గంపాడు, సెప్టెంబరు 24: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి వంగలపూ డి అనితను మంగళవారం బూర్గంపాడు మండల బీఆర్ఎస్ నాయకులు మ ర్యాదపూర్వకంగా కలిసారు. తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీకృష్ణ, సొసైటీ ఛైర్మన్ శ్రీనివాసరావు పాయకరావుపేటలోని ఆమె నివాసంలో కలిసి శాలువతో సన్మానించారు. భద్రాచలం సీతారామచం ద్రస్వామి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో రామిరెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

భద్రాచలం, సెప్టెంబరు 24: దుమ్ముగూడెం మండలం మంగవాయిబాడు వ గ్రామానికి చెందిన పొడియం సురేష్ ఇల్లు ఇటీవల విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. దీంతో ఐటీడీఏ అధికారులు కూలి పనులు చేసు కొని జీవిస్తున్న సురేష్ కుటుంబానికి ఐటీడీఏ గిరిజన రిలీఫ్ ఫండ్ నుంచి రూ.25 వేలను ఐటీడీఏ పీవో బి.రాహుల్ అందజేశారు.

రికార్డులను పరిశీలించిన ఆర్జేడీ

దమ్మపేట, సెప్టెంబరు 24: 2013లో దమ్మపేట మండల విద్యాశాఖా ధికారిగా విధులు నిర్వహించిన వనమా వెంకటేశ్వరరావు ఆర్థిక లావాదేవీ లలో అక్రమాలకు పాల్పడటంతో సస్పెన్షన్‌కు గురైయ్యారు. ఈ ఘటనపై వ రంగల్ విద్యాశాఖా ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి మంగళవారం దమ్మపేట మండల ఎంఈవో కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఎంఈవో లక్ష్మిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.

'పంట నమోదు తప్పనిసరి'


పంటలను పరిశీలిస్తున్న బాబూరావు

మణుగూరు, సెప్టెంబరు 24: రైతులు తమ పంట వివరాలను తప్పని స రిగా నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యసాయ అధికారి బాబూరావు తెలి పారు. మంగళశారం మణుగూరులోని అన్నారం గ్రామంలో నిర్వహిస్తున్న పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రభుత్వం రైతు భరోసాలో భాగంగా రైతులకు క్వింటాకు రూ.500 రూపాయాల బోనస్ ఇస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంట న మోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు.

హామీ ఇస్తే అమలు చేస్తా: ఎమ్మెల్యే

చంద్రుగొండ, సెప్టెంబరు 24: ప్రజలకు ఒక సారి హామీ ఇస్తే ఆ హామీని అమలు చేసి తీరుతానని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆది నారాయణ తెలిపారు. చంద్రుగొండలోని వసతి గృహాలు, కార్యాలయా లలో మౌలిక వసతుల కల్పనకు రూ.90 లక్షల మంజూరు కాగా ఆ పనులకు మంగళవారం ఎమ్మెల్యే జారే ప్రారంభించారు. తొలుత క స్తూర్బా పాఠశాలలో రూ 47.50 లక్షలతో చేపటనున్న సీసీ రోడ్డు, పా ఠశాల గోడపై ముళ్ల కంచే, విద్యుత్ తదితర పనులను ప్రారంభించా రు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి బోధన జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. అనంతరం గిరిజన ఆశ్రమ పాఠశాలకు రూ.18 లక్షలతో చేపడుతున్న డ్రైనేజీ పనులకు, బీసీ బా లికల వసతి గృహానికి రూ.7లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, విద్యు త్ సబ్‌స్టేషన్‌కు రూ7.50 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డుకు. ప్రభు త్వ ఆసుపత్రిలో రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనుల ప్రా రంభానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. దీంతో పాటు మహిళా శక్తి పథకం లబ్ధిదారులకు రూ.8 లక్షల రుణాలను అందచేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడు ప్రాంభించిన పనులకు నిధు


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జారే

లు మంజూరు చేయాలని స్థానిక ప్రజలు, నాయకులు, అధికారులు కోరిన మీదట నిధులు మంజూరు చేయిస్తానని గతంలో హామీ ఇచ్చా అమలు చేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సంధ్యారా ణి, ఎంపీడీవో అశోక్, ఎంఈవో సత్యనారాయణ పాల్గొన్నారు.

మాకు పరిహారం రాలేదు సార్..

ఎమ్మెల్యే 'పాయం'కు ఫిర్యాదు చేసిన మహిళలు

మణుగూరు, సెప్టెంబర్ 24 : మాకు నష్టపరిహారం అందలేదంటూ పలువుర వరద బాధిత కుటుంబాల మహిళలు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు మంగళవారం మొరపెట్టుకున్నారు. పరిహారం అం దలేదు అంటూ సుందరయ్యనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు ఎక్కువశాతం మహిళలు దరఖాస్తులను చేతబూని మండల రెవెన్యూ, మునిసిపాలిటీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వాస్తవానికి నిండా నష్టపోయిన వాళ్లం మేము.. ఎవరికో ఇచ్చారు. సర్వేల్లో పేర్లు రాసుకున్నారు. నేటి వరకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వలేదు.. రేపు వస్తాయి మాపు వస్తాయి అనుకుంటూ మేము ఉంటే..అధికారులు మాత్రం ఇప్పుడు టైం అయిపోందని చెప్పడం ఎంత వరకు న్యాయం అంటూ కొందరు నిరుపేద మహిళలు గగ్గోలు పెడుతున్నారు. తీరని అ


'పాయం' ఎదుట ఆవేదన వెలిబుచ్చుతున్న మహిళలు

న్యాయం చేశారు. అసలు మునిగిన వాళ్లకు కొందరికి ఇచ్చి మరికొం దరికి మొండిచేయి చూపుతారా అంటూ ఆవేదనతో వ్యక్తం చేస్తున్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఇరువర్గాల ఫిర్యాదు

దుమ్ముగూడెం, సెప్టెంబరు 24: దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నివాస గృహం వద్ద సోమవారం జరిగిన ఘర్షణపై ఇరువర్గాలు మంగ ళవారం ఫిర్యాదు చేసుకున్నారు. పీహెచ్‌సీలో విధులు నిర్వర్తిస్తున్న ఓ ఏఎన్ఎం, సంచార వైద్యాధికారి భార్యల మధ్య కొంత కాలంగా ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో వీరివురూ ఒకరిపై ఒకరు కారం చల్లుకొని భౌతిక దాడికి పాల్పడ్డా రు. ఎస్ఐ పోటు గణేష్‌కు ఇరువురూ ఫిర్యాదు చేశారు.

'ఇచ్చిన ప్రతీ హామీని ప్రభుత్వం నెరవేరుస్తుంది'



కరకగూడెం, సెప్టెంబరు 24: ఎ న్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీ ని ప్రభుత్వం తీరుస్తుందని కాం గ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు స య్యద్ ఇక్బాల్ హుస్సేన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం లోని పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల దీవెనలు, కార్యకర్తల కష్టంతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పినపాక నియోజక వర్గాన్ని అభివృద్ధి పదంలో తీసుకుపోతున్నారన్నారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఉప సర్పంచ్ రావుల రవి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు నాగబండి వెంకటేశ్వర్లు, మండల నాయకులు జట్ల సత్యం, చందా రత్తమ్మ, రఫీ, భూక్యా అర్జున్, వెంకటేశ్వర్లు, రామనాధం, సత్యం, బరపటి వెంకన్న పాల్గొన్నారు.

'వీఆర్ఏలను తిరిగి తీసుకోవాలి'

అశ్వారావుపేట, సెప్టెంబర్ 24: గతంలో వీఆర్ఏ లుగా పనిచేసి పలు శాఖలకు పంపిన వీఆర్ఏలను అందరిని తిరిగి మాతృశాఖలోకి తీసుకోవాలని దాసరి శ్రీను, మహేందర్, తులసమ్మ, సత్యం, లక్ష్మి తహసీల్దా ర్‌కు వినతి పత్రం అందజేసారు. తామంతా దశాబ్దా లుగా రెవెన్యూ శాఖలో వీఆర్ఏలుగా పనిచేసామని, గత ప్రభుత్వ హయాంలో రెవిన్యూ శాఖను ఎత్తివేసి తమను పలు శాఖలలోకి పంపించడం జరిగిందన్నా రు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం రెవెన్యూ చట్టాన్ని తిరిగి తెచ్చే ప్రయత్నం చేస్తున్నట్టు మంత్రులు ప్రక టించారన్నారు. అందులో భాగంగా తమను తిరిగి రెవెన్యూ శాఖలలోకి తీసుకోవాలని కోరారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి: సీపీఐ

మణుగూరు, సెప్టెంబరు 24: మణుగూరు మునిసిపాలిటీలో పారిశుధ్య పనులు చేపట్టడంలో స్థానిక అధికారులు పూర్తిగా విఫలమయ్యారని, కమిషనర్‌కు చెప్పినా కూడా ఫలితం శూన్యంగా ఉంటోందని సీపీఐ మండల నాయకులు దుర్గ్యాల సుధా కర్, సోందె కుటుంబరావు, ఎస్కే నాయుడు అన్నారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేవలం పట్టణ ప్రాంత తప్ప మిగతా ఏరియాలను కమిషనర్, సిబ్బంది మరిచారన్నారు. ఎక్కడ చెత్తా చెదారం అక్కడే ఉంటోందని, వర్షాకాలంలో వీధి దీపాలు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోక పోతే ఆందో ళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు తోట రమేష్, జక్కుల రాజబాబు, రాయల భిక్షం, కొత్తపల్లి సీతారాములు, సంపత్, ప్రసాద్, ఉపేందర్, రాములు, దశరధం, తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక సమస్యలపై ఉద్యమాలు నిర్మించాలి'

భద్రాచలం, సెప్టెంబరు 24: స్థానిక సమస్యలపై ప్రజా ఉద్యమాలు నిర్మించా లని మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు అన్నారు. భద్రాచలంలోని ఎమ్మెల్యే కాలనీలో 8వ శాఖ మహాసభలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొ ని మాట్లాడుతూ నూతన ఆర్థిక విధానాలు ఫలితంగా ప్రజల జీవన ప్రమా ణాలు పడిపోతున్నాయని, రోజు రోజుకి పేదరికంలోకి నెట్టబడుతున్నారని అన్నారు. పేద ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా అందని పరిస్థితి ఏర్పడిందని, ఎమ్మెల్యే కాలనీలో అంగన్‌వాడీ సెంటరుకు పక్కా భవనం నిర్మించాలని, డ్రైన్లు సీసీ రోడ్డు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గడ్డం స్వామి, వై.వెంకట రామారావు, నాదెళ్ల లీలావతి, పి.సంతోష్‌కుమార్, ఎంవి ప్రసాదరావు, డి.సీతా లక్ష్మి, ఎంవిఎస్ నారాయణ పాల్గొన్నారు.

జ్యూడీషియల్ కోర్టులో స్వచ్ఛ భారత్

భద్రాచలం, సెప్టెంబరు 24: భద్రాచలంలోని ప్రధమశ్రేణి న్యాయస్థానంలో మంగళవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని న్యాయమూర్తి ఎం.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. అనంతరం కోర్టు ఆవరణలో ని ర్వహించిన పారిశుధ్య కార్యక్రమంలో న్యాయమూర్తితో పాటు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం న్యాయమూర్తి భద్రాచలంలోని ప్రత్యేక సబ్‌జైలును సందర్శించి జైలులో ఉన్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు.

భద్రాద్రి జిల్లాలో వర్షం

చుంచుపల్లి, సెప్టెంబరు 24: భద్రాద్రి జిల్లాలో ఏకధాటిగా నాలుగు గంటల పాటు మంగళవారం ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షానికి కొత్త గూడెం, ఇల్లెందు, అశ్వారావుపేట, పినపాక, భద్రాచలం నియోజకవర్గాలలో జనజీవనం స్తంభించింది. పాఠశాల, కళాశాల నుంచి తిరిగి ఇంటికి వెళ్లే విద్యా ర్థులు అవస్థలు పడ్డారు. భారీగా కురిసిన ఈ వర్షాలకు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

పోలీసుల విస్తృత తనిఖీలు

ఆళ్లపల్లి, సెప్టెంబర్ 24: మావోయిస్టు వా రోత్సవాల నేపథ్యంలో ఆళ్లపల్లి పోలీసులు రెండు రోజుల నుంచి అప్రమత్తమైనారు. మంగవారం ఆళ్లపల్లి ఎస్ఐ రతీష్ ఆధ్వర్యంలో మర్కోడు, రామవాపూరం, ఇతర గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి, సెంటర్లలో వాహనాల తనిఖీ చేపట్టా రు. అనుమానితులను ప్రశ్నించి, వారి నుంచి వివరాలు సేకరించి వదిలేస్తున్నారు. వాహనా లకు సరైన పత్రాలు లేనివారిని అదుపులోకి తీసుకుంటున్నారు. అనుమానితులు ఎవరైన తా రస పడితే సమాచారం ఇవ్వాలని తెలిపారు. వా హనదారుడు తప్పకుండా వాహన ధృవీకరణ ప త్రాలను కలిగి ఉండాలని పోలీసులు సూచించా రు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మహేష్ కుమార్‌కు సన్మానం



చర్ల, సెప్టెంబరు 24: టీపీసీసీ అధ్యకుడు మహే ష్‌కుమార్ గౌడ్‌ని మంగళవారం భద్రాచలం టీపీసీ సీ సభ్యులు నల్లపు దుర్గా ప్రసాద్ హైదరాబాద్‌లో ని గాంధీ భవన్‌లో కలుసుకున్నారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు. భద్రాచలం సీ తారామ చంద్రస్వామి జ్ఞాపికలను అందజేశారు.

డీఎడ్ ప్రవేశాల జాబితాను విడుదల చేసిన పీవో

భద్రాచలం, సెప్టెంబరు 24: భద్రాచలంలోని గిరిజన డీఎడ్ కళాశాలలో ప్రవేశాలకు సంబం ధించిన పదో బ్యాచ్ మెరిట్ జాబితాను మంగళ వారం భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ విడు దల చేశారు. మొత్తం 50 సీట్లకు గాను 48 మంది మెరిట్‌లో, రెండు సీట్లు స్పెషల్ కేటగిరి సీట్లుగా పరిగణించి భర్తీ చేయడం జరిగిందని తెలిపారు. ఎంపికైన వారికి ఈ నెల 27న కళాశాలలో కౌన్సె లింగ్‌కు హాజరు కావాలని కోరారు. ఎంపికైన వా రు ఈ విషయాన్ని గుర్తించి, ఆ రోజు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పీవో రాహుల్ ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమంలో డీడీ మణెమ్మ, కళాశా ల ప్రిన్సిపాల్ పీవీకే భవాని పాల్గొన్నారు.

'హెల్మెట్ సామాజిక బాధ్యత'

టేకులపల్లి, సెప్టెంబరు 24: ద్విచక్ర వాహనం నడిపేట ప్పుడు హెల్మెట్ ధరించడం సామాజిక బాధ్యతగా తీసుకో వాలని టేకులపల్లి ఎస్సై పోగుల సురేష్ అన్నారు. టేకులప ల్లిలో మంగళవారం పోలీసులు హెల్మెట్ డ్రైవ్ నిర్వహించా రు. ఈ డ్రైవ్‌లో హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న పలువురికి మోటారు వెహికిల్ యాక్టు ప్రకారం జరిమా నాలు విధించారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా వాహ నాల నడుపుతున్న వారికి అవగాహన కల్పించారు. వాహన దారులు హెల్మెట్ ధరించకపోవడంతో చాలా మంది ప్రా ణాలు కోల్పోతున్నారని, హెల్మెట్ ధరించి వాహనాలు నడప డం వలన హెల్మెట్ రక్షణ కవచంలా ఉపయోగపడుతుంద న్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి తమ విలువైన ప్రా ణాలు కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.